తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం | సూర్యాపేట | యాద్రాద్రి భువనగిరి

ఆదివారం 18 అక్టోబర్ 2026 | పేజీలు : 8



Follow :

## పదేళ్ల నిరీక్షణకు తెర..

# రూ.2.10 కోట్లతో సబ్‌స్టేషన్ ప్రారంభం!



- రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- రంగారెడ్డి గూడెంలో విద్యుత్ సబ్‌స్టేషన్, మహిళా సమాఖ్య భవనం ప్రారంభం
- కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బాలు నాయక్

**పి.ఏ.పల్లి,అక్టోబర్ 17 (జనంసాక్షి):** రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించి, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు.పి.ఏ.పల్లి మండలం మేడారం గ్రామ పరిధిలోని రంగారెడ్డి గూడెంలో రూ.2.10 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించి,పి.ఏ.పల్లి మండలానికి చెందిన అర్హులైన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.

**పదేళ్ల కల సాకారం.. రైతులకు ఊరట!**

రంగారెడ్డి గూడెం ప్రాంతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్నది స్థానిక ప్రజలు, రైతుల పదేళ్ల కల అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కల సాకారమైందని తెలిపారు. నూతన సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మెరుగుపడటంతో పాటు, లో-వోల్టేజీ, అధిక లోడ్ సమస్యలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు.రైతులు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడకుండా వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు.

**రైతుల పంటలు ఎండిపోకుండా చూడాలి**

విద్యుత్ సమస్యల కారణంగా రైతులు పంట నష్టాలను ఎదుర్కొనే పరిస్థితి రాకూడదని ఎమ్మెల్యే అన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రతి రైతుకు మెరుగైన విద్యుత్ సరఫరా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

**మహిళల ఆర్థిక స్వావలంబనకు సమాఖ్య భవనం**

రంగారెడ్డి గూడెంలో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సంఘాల సమావేశాలు, పొదుపు, రుణాలు, స్వయం ఉపాధి కార్యక్రమాల ప్రణాళికలకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడు తుందని తెలిపారు. మహిళలు సంఘటితంగా ముందుకు సాగుతూ ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు.

**పేదింటి ఆడబిడ్డల వివాహాలకు భరోసా**



అనంతరం పి.ఏ.పల్లి మండలానికి చెందిన అర్హులైన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా, మహిళా సంఘాల బలోపేతం, పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలవడం ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతలని ఎమ్మెల్యే బాలు నాయక్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళు తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి శేఖర్ రెడ్డి,తహసీల్దార్ జయశ్రీ, విద్యుత్ శాఖ అధికారులు,పి.ఏ.పల్లి,గుడిపల్లి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నెర్మటి సతీష్ రెడ్డి,మావిళ్ల లక్ష్మీ నారాయణ,కాంగ్రెస్ నాయకులు ఏ.వి.రెడ్డి,తేర సత్యనారాయణ రెడ్డి, కుక్కల గోవర్ధన్ రెడ్డి,కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్,మద్దిమడుగు రామస్వామి,సర్పంచులు ఎలూగూరి జయమ్మ భాస్కర్ రెడ్డి,గొంగడాల వెంకటయ్య,రాగం అంజయ్య,వంగాల శ్రీనివాస్ రెడ్డి,కొర్ర రాంసింగ్, శ్రీరామ్, శంకర్, ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు,మహిళలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

---

## పాల్వంచ కేటీపీఎస్

# కాలువలో విషాదం

### ఇద్దరు యువకులు మృతి

- కిన్నెరసాని నుంచి వచ్చే కేటీపీఎస్ కాలువలో ఈతకు దిగి గల్లంతు
- అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ స్థానికుల ఆగ్రహం
- ఫెన్సింగ్, హెచ్చరిక బోర్డులు లేకనే వరుస మరణాలు



వార్తా లోపలి పేజీలో

---





## గిరిజన మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

**ఐటీడీఏ పీవో బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ**

**భద్రాచలం అక్టోబర్ 17 (జనంసాక్షి)**

ఐటీడీఏ భద్రాచలం డివిజన్ పరిధిలోని ఆదివాసీ గిరిజన గ్రామాల మహిళలకు, ప్రజలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ పేర్కొన్నారు. శనివారం వారు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళలకు ఎంతో ప్రత్యేకమైనదని తెలిపారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించి, మహిళలు, చిన్నారులు కలిసి పాటలు పాడుతూ ఆటపాటలతో పండుగను ఆనందంగా జరుపుకోవడం విశేషమన్నారు. చివరి రోజైన సద్దుల బతుకమ్మ సందర్భంగా గ్రామాల ప్రజలంతా ఒకచోట చేరి గౌరమ్మకు పూజలు నిర్వహించడం, బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి

వార్తా లోపలి పేజీలో

---

## ప్రజల భద్రతే లక్ష్యంగా

# ముందడుగు

- దమ్మాయిగూడెం సమీపంలో రహదారి గుంతలకు కాంక్రీట్‌తో మరమ్మతులు
- ప్రమాదాల నివారణకు ప్రత్యేక చొరవ
- ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగిన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం
- రాజశేఖర్ సర్పంచ్ వీరదాసు వినోద



**తిరుమలాయపాలెం, అక్టోబర్ 17 (జనం సాక్షి ):** ఖమ్మం నుంచి వరంగల్ వెళ్లే జాతీయ రహదారిపై దమ్మాయిగూడెం గ్రామ సమీపంలో ఏర్పడిన రహదారి గుంతలకు కాంక్రీట్‌తో మరమ్మతులు చేపట్టారు. రహదారిపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడటంతో

వార్తా లోపలి పేజీలో

## కనకదుర్గమ్మ ఆలయంలో పటేల్ రమేష్ రెడ్డి ప్రత్యేక పూజలు

### పూజలు నిర్వహిస్తున్న పటేల్



**పెన్ పహాడ్, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** మండల పరిధిలోని లింగాల గ్రామంలో శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం టూరిజం మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు గ్రామ సర్పంచ్ గార్లపాటి స్వర్ణ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేసి, రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,లింగాల కనక దుర్గమ్మ ఆలయం ఎంతో మహిమగల ఆలయమని, తనకు ఎంతో నమ్మకం ఉన్న దేవాలయమని అన్నారు. ప్రతి ఏటా దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్, మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ , కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...



## పత్తి పంటను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

**చంద్రుగొండ, అక్టోబర్ 17 (జనంసాక్షి):** మండలంలోని రావికంపాడు గ్రామానికి చెందిన రైతు మాలోత్ రమేష్ సాగు చేస్తున్న మూడు ఎకరాల పత్తి పంటను వ్యవసాయ శాస్త్రవేత్త డా. టి. భరత్, మండల వ్యవసాయ అధికారి వినయ్ , వ్యవసాయ విస్తరణ అధికారులు శనివారం పరిశీలించారు. పంట ఎదుగుదల, పూత, కాయల ఏర్పాటులో సమస్యలను గుర్తించి, నేల పరిస్థితులను అధ్యయనం చేశారు. పంట సమస్యలకు విత్తనాల నాణ్యత కారణమా, యాజమాన్య పద్ధతుల్లో లోపాలా అనే అంశాలపై శాస్త్రీయంగా పరిశీలించి నివేదిక అందిస్తామని తెలిపారు. రైతులు పంటల్లో సమస్యలు గుర్తించిన వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి సలహాలు పొందాలని సూచించారు.

## గిరిజన మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

**ఐటీడీఏ పీవో బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ**

నిమజ్జనం చేయడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేకతను చాటుతుందని పేర్కొన్నారు. ఈ పండుగ ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఐక్యత, సోదరభావం, సంతోషాన్ని మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు. అలాగే ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల పరిధిలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు సైతం సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు.

## లాడ్జిలో పాల్వంచ గ్యాస్ గోదాం మేనేజర్ ఆత్మహత్య

**- విచారణ కొనసాగుతుండగా ఘటన..**

**- కార్యాలయ వాట్సాప్ గ్రూపులో సూసైడ్ నోట్ పోస్టు చేసినట్లు సమాచారం**



**భద్రాచలం అక్టోబర్ 17 (జనంసాక్షి)** భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఓ ప్రైవేటు లాడ్జిలో పాల్వంచ గ్యాస్ గోదాం మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ శనివారం ఆత్మహత్య చేసుకున్నారు. కార్యాలయ వాట్సాప్ గ్రూపులో ఆయన సూసైడ్ నోట్ పోస్టు చేసినట్లు సమాచారం అందడంతో అప్రమత్తమైన పోలీసులు లాడ్జిలో ఆయన ఆచూకీ గుర్తించి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

# పాల్వంచ కేటీపీఎస్ కాలువలో విషాదం

## ఇద్దరు యువకులు మృతి

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 17( జనంసాక్షి):** పాల్వంచ కే టి పి ఎస్ పవర్ ప్లాంట్ పరిధిలోని కరకవాగు వద్ద మరో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. కిన్నెరసాని నుండి వచ్చే కేటిపిఎస్ కాలువలో శనివారం ఈతకు దిగిన ఇద్దరు యువకులు గల్లంతై ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనతో మృతుల కుటుంబాల్లో తీరని రోదన మిగిలింది.

**గత కొన్నేళ్లుగా ఇదే తంతు.. సేఫ్టీ ఎక్కడ?**

ఇది మొదటిసారి కాదు. గత కొన్ని సంవత్సరాలుగా కేటీపీఎస్ పవర్ ప్లాంట్ కాలువలో ఇదే తరహాలో అనేకమంది యువత, అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు సమస్య ఏమిటంటే.. కాలువ వద్ద కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమేనని విమర్శలు వస్తున్నాయి.కాలువకు ఇరువైపులా కనీసం ఇనుప కంచె (ఫెన్సింగ్) లేదా సేఫ్టీ వాల్ లేకపోవడం లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం.నీరు ఉధృతంగా ప్రవహించేటప్పుడు ప్రజలను అప్రమత్తం చేసే వ్యవస్థ లేకపోవడం.ప్రమాదకరమైన ఈ కాలువ పక్కనే జనావాసాలు, పొలాలు, పిల్లలు ఆడుకునే ప్రదేశాలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ప్రజల డిమాండ్లు:**

ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేటీపీఎస్ అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.మృతుల కుటుంబాలకు ప్రభుత్వం/యాజమాన్యం తక్షణమే నష్టపరిహారం ప్రకటించి ఆదుకోవాలని బాధ కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కేటీపీఎస్ కాలువ వెంబడి ప్రమాదకర ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో ఇనుప కంచె (ఫెన్సింగ్) ఏర్పాటు చేయాలి.?ప్రతి 100 మీటర్లకు ఒక హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసే విధంగా కార్యాచరణ చేపట్టాలని.ఇకపై ఇలాంటి ప్రాణనష్టాలు పునరావృతం కాకుండా శాశ్వత భద్రతా చర్యలు చేపట్టాలి.ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ నిర్లక్ష్యానికి ఇప్పటికైనా తెరపడుతుందా? లేక మరిన్ని కుటుంబాలు తమ



ఆత్మీయులను కోల్పోవాల్సిందేనా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల తరపున బాధితులకు న్యాయం జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు.



## కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలి

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):** కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి వైద్య సిబ్బంది కృషిచేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ బి.నగేష్‌నాయక్ కోరారు. స్థానిక పీహెచ్‌సీలో శనివారం ఎల్‌సీడీసీ కార్యక్రమంపై ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఎండీటీ చికిత్స విధానం ద్వారా కుష్టు వ్యాధిని నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎం.భిచ్చునాయక్, సూపర్‌వైజర్ లలిత, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పడమరలోకవరంలో వైభవంగా సామూహిక కుంకుమార్చనలు

**కల్లూరు మండలంలో అత్యంత భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ వేడుకలు**

**పడమరలోకవరంలో మహిళా భక్తుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా సామూహిక కుంకుమార్చన పూజలు**





**కల్లూరు అక్టోబర్ 17(జనంసాక్షి)** కల్లూరు మండల వ్యాప్తంగాదసరా ఉత్సవాల్లో భాగంగా గ్రామీణ , పట్టణ,ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దేవి నవరాత్రి ఉత్సవాల మండపాల వద్ద ఏర్పాటుచేసిన, దుర్గ మాత అమ్మవారి విగ్రహాల వద్దా, సాంప్రదాయబద్ధంగా పలువురు బ్రాహ్మణోత్వముల మంత్రోత్సవాల నడుమ భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలను, బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నేత్రపర్వంగా జరుపుకుంటున్నారు.కల్లూరు మండల పరిధిలోని పడమరలోకవరం గ్రామంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు బతుకమ్మ వేడుకలు గత 7 రోజులుగా గ్రామ మాజీ సర్పంచ్ కళ్యాణపు కొండలరావు, కల్లూరు మున్సిపాలిటీ 9వ వార్డ్ కౌన్సిలర్ కళ్యాణపు నవ్య చౌదరి దంపతులు , శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల నిర్వాహ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శనివారం 7వ రోజు సందర్భంగా దుర్గాదేవి అమ్మవారిని శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణలో పట్టు వస్త్రములు పూలమాలలు సుగంధ ద్రవ్యములతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా వందలాది మంది మహిళ భక్తులు అమ్మవారిని దర్శించుకొని సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఉత్సవ నిర్వాహ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పురుషులు, మహిళలు అత్యంత నియమనిష్టలతో 11 రోజులపాటు భవాని మాల దీక్ష స్వీకరించారు.. ప్రతిరోజు అమ్మవారికి వివిధ రూపాల్లో అలంకరణ చేసి పూజాకార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పలు రకాల పూలతో బతుకమ్మలను సిద్ధం చేసి మహిళలు కోలాటం నృత్యాలు, బతుకమ్మ ఆటపాటలతో సంబరాలు కోలాహలంగా ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు ప్రతిరోజు నిర్వహిస్తున్న బతుకమ్మ శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో వందలాదిమంది మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు.ఒకవైపు తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు సందడి చేస్తుండగా, మరోవైపు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమా లను నిర్వహిస్తూ అమ్మవారిని భక్తులు దర్శించు కుంటున్నారు. శనివారం నిర్వహించిన మహాలక్ష్మి దేవి కుంకుమార్చన కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు హాజరై భక్తిపారవశ్యం తో పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉండాలని, గ్రామ ప్రజలందరూ పాడిపంటలతో అష్టవిషయములతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకొన్నారు. పడమరలోకవరంలో నేత్రపర్వంగా జరుగుతున్న శ్రీదేవి నవరాత్రిఉత్సవాలు, బతుకమ్మ వేడుకలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

# రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

○విద్యుత్ శాఖ రాష్ట్ర ఆపరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు..
○భట్టుగూడెం గ్రామంలో రైతులతో ప్రత్యేక సమావేశం..



**బీబీనగర్ (జనంసాక్షి ):** రైతులకు వ్యవసాయ అవసరాల కోసం నిరంత రాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ రాష్ట్ర ఆపరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం భట్టుగూడెం గ్రామంలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వ్యవసాయ విద్యుత్ సరఫరా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రైతులతో నేరుగా మాట్లాడి, విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు, అంతరాయాల గురించి ఆరా తీశారు. పంటలకు సకాలంలో నీరందించేందుకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు ఏవైనా విద్యుత్ సమస్యలు ఎదురైతే సిబ్బంది వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను తెలుసుకుని, మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కందాడి సురేష్ కుమార్, డీఈ వెంకటేశ్వర్లు, ఏడీఈ మచ్చేందర్, ఏఈ మనోహర్ రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్లు యాదగిరి, రియాఉద్దిన్, స్థానిక లైన్‌మెన్ నరేందర్, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం: ఆర్టిఏ జిల్లా సభ్యులు రాజిరెడ్డి



**కనగల్లు, అక్టోబర్ 17 (జనంసాక్షి):** పేద కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా రీజనల్ అథారిటీ సభ్యుడు కుసుకుంట్ల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని ఇస్లాం నగర్ గ్రామపంచాయతీ పరిధిలో కన్యబాయి తండా గ్రామంలో ఇందిరమ్మ గృహ పథకంలో మంజూరైన ఇల్లును లబ్ధిదారులు సకాలంలో పూర్తిచేసుకుని లబ్ధిదారులు రజిత దంపతుల ఆహ్వానం మేరకు శనివారం వారితో కలిసి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలనలో ఇందిరమ్మ గృహ పథకం నిరుపేద కుటుంబానికి ఆనందాన్ని నింపిందన్నారు. సొంత ఇంటి కల సహకారం కావాలని ఎంతో ఆశతో ఉన్న కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు భద్రతతో పాటు భరోసా ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కరీం పాషా, స్థానిక సర్పంచ్ బోయపల్లి అనుష, బోయపల్లి జానయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సలీం, ఖాదర్, షబ్బీర్, శ్రీను, సునీల్ నవీన్, సలీం, ఉమర్, పంచాయతీ కార్యదర్శి నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.



## మహాలక్ష్మీ దేవిగా దుర్గామాత దర్శనం

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత మహాలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో విశేష పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. కొమ్మాల గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉన్న దుర్గాదేవి విగ్రహం వద్ద అర్చకులు భక్తులు శాంతి హోమం నిర్వహించారు. గ్రామంలోని దుర్గాదేవి మండపం వద్ద వైభవంగా హోమ కార్యక్రమాలు జరిగాయి. కొమ్మాలలో ఉన్న బోడ్రాయి వద్ద ప్రతిష్ఠించిన విగ్రహం వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు జరిపి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## జిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా పెద్దిరెడ్డి గణేష్ ఏకగ్రీవ ఎన్నిక

**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలో జరిగిన కవులు, రచయితల సమావేశంలో సూర్యాపేట జిల్లా రచయితల సంఘం ఏర్పాటైంది.ఇటీవల జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో నియోజకవర్గ రచయితల సంఘాలు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ నాలుగు నియోజకవర్గాల కార్యవర్గాల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న కార్యవర్గ సభ్యులు,కవులు, రచయితలు కలిసి శనివారం జిల్లా కేంద్రంలోని సుధా బ్యాంక్ లో జిల్లా రచయితల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రముఖ కవి, రచయిత, సాహితీవేత్త పెద్దిరెడ్డి గణేష్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా, ప్రముఖ కవి పిల్లలమర్రి పినవీరభద్రం కళాపీఠం వ్యవస్థాపకులు శీలా అవిలేను ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు.ఈ సంఘానికి జిల్లాలోని సీనియర్ రచయిత ఆలేటి శంకర్ ను సంఘం గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు.నూతనంగా ఏర్పడిన జిల్లా రచయితల సంఘం గౌరవ సలహాదారులుగా బెల్లంకొండ శ్రీరాములు, గడ్డం నర్సయ్య,తుమ్మ రాజాను నియమించారు.ఉపాధ్యక్షులుగా ధర్మారి వెంకటేశ్వర్లు, పుప్పాల కృష్ణమూర్తి, ఎర్ర హరికిషన్, సంయుక్త కార్యదర్శులుగా గొడితాల వెంకటేశ్వర్లు, వేముల వెంకటేశ్వర్లు, సరికొండ నరసింహారాజు ,ప్రచార కార్యదర్శిగా పబ్బతి వెంకటేశ్వర్లు,కార్యవర్గ సభ్యులుగా ముక్కామల జానకి రాములు, ఏబెల్ శశి, ఎన్నీ రోజా, పూసోజు పద్మ, పోతుగంటి వీరాచారి, జిల్లేపల్లి జానయ్య, కొర్రపిడత శ్రీనివాస్, లింగాల శ్రీనివాస్, కొండా లింగారావు, తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా నూతన జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ సాహిత్య సాంస్కృతిక రంగంలో కవులు రచయితలను ఒక తాటిపై నడిపి సూర్యాపేట సాహిత్యరంగాన్ని సుసంపన్నం చేస్తామని అన్నారు. నూతన వర్తమాన కవులు, రచయితలకు ప్రోత్సాహం ఇస్తూ వారి రచనలను వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తామన్నారు.తెలుగు భాషను సుసంపన్నం చేసే దిశగా అనేక కార్యక్రమాలు తీసుకుంటామన్నారు. కవిత్వ కార్యశాలలతో పాటు, తెలుగు భాష విస్తృతికి ఉన్నతికి తెలుగు భాషా ఉపాధ్యాయులను కలిసి కృషి చేసేలా ప్రయత్నం చేస్తామని అన్నారు.పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన కవిత్వ, కథా పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

## హైమాస్ట్ లైట్ ను ప్రారంభించిన సర్పంచ్ పాలకూరి రమాదేవి నర్సింహ గౌడ్

### 3 వ వార్డు మునుగోడు నుండి నార్కట్ పల్లి -చిట్యాల రహదారిల సర్కిల్లో.

**మునుగోడు అక్టోబర్ 17 (జనంసాక్షి).** మునుగోడు మండల కేంద్రంలోని 3వార్డు నార్కట్ పల్లి - చిట్యాల వైపునకు వెళ్లే బ్రిడ్జి వద్ద మార్నింగ్ వాక్ చేస్తుండగా రాత్రి సమయంలో రహదారి కూడలి వద్ద ప్రయాణికులకు రాకపోకలు లైట్స్ లేకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి ప్రయాణికులకు వాహనాదాలు ఇబ్బందులు పడుతున్నారని అక్కడ ఉన్న గ్రామస్తులు స్పందించి శాసనసభ్యులు దృష్టికి తీసుకెళ్లారు, తక్షణమే స్పందించిన మునుగోడు శాసనసభ్యులు శ్రీ.కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిధుల నుండి మంజూరు అయిన ×రూ.1,75,000/-× విలువ గల ఆరు లైట్ల తో కూడిన హైమాస్ట్ లైట్ ను మునుగోడు గ్రామ సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ , 3వార్డు మెంబర్ పందుల ప్రియాంక లింగస్వామి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించినారు. అక్కడినుండి వెళ్లే ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు , ఈ కార్యక్రమంలో మునుగోడు గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమనపల్లి సైదులు , గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లు, సిబ్బంది , కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు చీరల పంపిణీ

**తుర్కపల్లి ,అక్టోబర్ 17 (జనంసాక్షి)** తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామంలో గ్రామ ఆడపరచులకు బతుకమ్మ దసరా పండుగ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు బతుకమ్మ పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కల్లూరి ప్రభాకర్ రెడ్డి నాయకులు కల్లూరి కరుణాకర్ రెడ్డి, కల్లూరి వెంకట నరసింహారెడ్డి, కల్లూరి శ్రీనాథ్ రెడ్డి ,కందుకూరి నవీన్ కుమార్ ,వేముల లక్ష్మి నరసయ్య, కొడపాక పాపయ్య , కొడపాక సోమయ్య, కొడపాక మహేష్ ,వేముల మధు ,గ్రామస్తులు , మహిళలు పాల్గొన్నారు.



## మహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు

**హాలియా అక్టోబర్ 17 జనంసాక్షి** శ్రీదేవి శరణ నవరాత్రులు భాగంగా శనివారం అమ్మవారు మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయి మందిరంలో ఆలయ అర్చకుడు మనోజ్ పాండే ఆధ్వర్యంలో రామాలయంలో వెంకటాచారుల ఆధ్వర్యంలో స్వయం వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు గోవర్ధన్ రాఘవచారు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి సందర్శించి అమ్మవారు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్‌కు ఉత్తమ అవార్డుల పంట



**చౌటుప్పల్ అక్టోబర్ 17(జనం సాక్షి) :** లయన్స్ ఇంటర్నేషనల్ (డిస్ట్రిక్ట్ 320-జి) 2025-26 సంవత్సరానికి గాను ప్రకటించిన డిస్ట్రిక్ట్ బెస్ట్ అవార్డులలో లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ విశేష సేవలందించిన పలువురు ప్రతినిధులకు ప్రతిష్టాత్మక అవార్డులు లభించాయి.క్లబ్ సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా సమన్వయం చేసినందుకు గాను జోన్ చైర్మన్ పోలోజు శ్రీనివాస చారి 'ఎక్సలెంట్ జోన్ చైర్మన్' అవార్డును అందుకున్నారు. అలాగే, క్లబ్ విస్తరణకు కృషి చేసినందుకు గాను దాచేపల్లి ప్రకాష్ 'క్లబ్ ఎక్స్‌టెన్షన్' అవార్డును, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తిరందాసు జగన్నాథం విశిష్ట సేవలకు గాను 'అవుట్‌స్టాండింగ్ బెస్ట్ ప్రెసిడెంట్' అవార్డును కైవసం చేసుకున్నారు.ఈ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎమ్.డి. అథర్ పాషా, లయన్ చింతల ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొని అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు.



# తడి, పొడి చెత్తను వేర్వేరుగా మున్సిపల్ వాహనానికి అందించాలి

## మున్సిపల్ కమిషనర్ కే రవీందర్ రెడ్డి



**హాలియా జనం సాక్షి అక్టోబర్ 17**
రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు తప్పవుహాలియా, అక్టోబర్ 17: పట్టణ పరిశుభ్రతను కాపాడటంలో ప్రజలు, వ్యాపారస్తులు అందరూ భాగస్వాములు కావాలని హాలియా పురపాలక సంఘం మున్సిపల్ కమిషనర్ శ్రీ కె. రవీందర్ రెడ్డి గారు కోరారు. పట్టణంలోని ప్రతి ఇంటి నుంచి, ప్రతి దుకాణం నుంచి వెలువడే వ్యర్థాలను తడి చెత్త, పొడి చెత్తగా వేర్వేరుగా విభజించి, మున్సిపల్ చెత్త సేకరణ వాహనానికి మాత్రమే అందించాలని సూచించారు. ప్రధాన రహదారుల వెంబడి ఉన్న దుకాణదారులు తమ దుకాణాల నుంచి వెలువడే చెత్తను రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాల్లో పడవేయకూడదని స్పష్టం చేశారు. ఇలా చెత్తను బహిరంగంగా వదిలేయడం వల్ల పట్టణ పరిశుభ్రత దెబ్బతింటుందని, దోమలు, ఈగలు పెరిగి ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో, సాగర్ రోడ్డులోని కళ్యాణి డ్రెస్సెస్ దుకాణం వారు చెత్తను రోడ్డుపై పడవేసినందుకు నిబంధనల ప్రకారం రూ. 1,000 జరిమానా విధించినట్లు కమిషనర్ తెలిపారు. ఇకపై కూడా ఎవరైనా రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పడవేస్తే, వారిపై నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడం కేవలం మున్సిపాలిటీ బాధ్యత మాత్రమే కాదని, అది ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని కమిషనర్ స్పష్టం చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందిస్తూ, రోడ్లపై చెత్త వేయకుండా ఉండి, స్వచ్ఛమైన హాలియా నిర్మాణానికి ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జరిమానాలు విధించాలని మున్సిపాలిటీ ఉద్దేశం కాదు. హాలియా ప్రధాన రోడ్లపై చెత్త వేయకండి, జరిమానాల భారం మోయకండి. జరిమానాలు లేని స్వచ్ఛ హాలియా మున్సిపాలిటీని కలిసి నిర్మించుకుందాం.

# చిరువ్యాపారులకు వడ్డీ లేని రుణాలను అందించాలి

**హుజూర్ నగర్ అక్టోబర్ 17 (జనంసాక్షి):**
పట్టణ ప్రాంతాల్లోని రోడ్డు ప్రక్కన చిరు వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం ఐదు లక్షల రూపాయల వడ్డీ లేని రుణాన్ని వెంటనే అందించాలని ఐఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వర్తక సంఘం కార్యాలయంలో పట్టణ చిరు వ్యాపారుల సమావేశం ఐఎన్టియుసి పట్టణ అధ్యక్షులు మద్దం నాగేందర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగన్న గౌడ్ మాట్లాడుతూ గత యూపీఏ ప్రభుత్వంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా చిరు వ్యాపారులకు స్వస్తియ యోజన పథకం ద్వారా రెండు లక్షల రుణాలను అందించే వారని, అట్టి రుణాలను బిజెపి ప్రభుత్వం ముద్ర పథకం ద్వారా ప్రారంభించి దానిని పూర్తిస్థాయిలో అందించటంలో విఫలమైందన్నారు. అదే పథకాన్ని నేటి పరిస్థితులవలన పేదల ఆర్థిక ఇబ్బందులు గుర్తించి వడ్డీ లేని



రుణంగా 5 లక్షల రూపాయలు, అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పట్టణంలోని పేద కార్మికుల కు అర్హులైన వారికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారం తో రామస్వామి గట్టు వద్ద ఇండ్లు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం యూనియన్ సభ్యత్వ ఫండును ఆయా సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు బెల్లంకొండ గురవయ్య, బ్లాక్ అధ్యక్షులు చిట్యాల అమర్ నాథ్ రెడ్డి, చింతకాయల రాము, లక్క వెం కన్న, రబ్బాని. మోహిను భాష, రమణ, రూప, నగేష్ పాల్గొన్నారు.

# డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజాప్రతినిధులు స్పందించాలి

○తెలంగాణ ఉద్యమకారుడు, బిఆర్ఎస్ పార్టీ, యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ఉప్పు కృష్ణ
○మహబూబ్ నగర్ నేతల పాదయాత్రలు అర్థరహితం
○ మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మౌనం బాధ్యతారాహిత్యం

**చౌటుప్పల్ అక్టోబర్ 17(జనంసాక్షి)**
డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రద్దు అంశంపై ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజా ప్రతినిధులు మౌనం వీడి, రాజకీయాలకు అతీతంగా స్పందించాలని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ఉప్పు కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలైన దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో సాగునీరు లేక అల్లాడుతున్న ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఆనాడు డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రూపొందించడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల మహబూబ్ నగర్ జిల్లాకు నష్టం జరుగుతుందంటూ ఆ జిల్లా ప్రజాప్రతినిధులు అన్ని రాజకీయ పార్టీలు ఒకే వేదికపైకి వచ్చి ఆందోళన చేయడం, ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేయడం అర్థరహితమని అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా ప్రయోజనాల గురించి మాట్లాడుతున్న నాయకులు ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజల ప్రయోజనాల గురించి కూడా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. అత్యంత వెనుకబడిన దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రధానమైనదని, ఆ ప్రాజెక్టును రద్దు చేస్తే రెండు నియోజకవర్గాలు ఎడారిగా మారడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. డిండి ప్రాజెక్టు రద్దు కోసం మహబూబ్ నగర్ నేతలు పాదయాత్రలు, సభలు చేస్తుంటే, ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి నేటికీ స్పందించక పోవడం బాధ్యతారాహిత్యమన్నారు. జిల్లా మంత్రులు స్పందించాలని, ముఖ్యంగా దేవరకొండ, మునుగోడు ఎమ్మెల్యేలు బాలు నాయక్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముందుండి ఉద్యమం నడపాలని డిమాండ్ చేశారు. విశాల దృక్పథంతో సాగు, తాగునీటి



ప్రాజెక్టుల విషయంలో ఆలోచించి, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తిచేసి చెరువులు, కుంటలు నింపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డిండి ప్రాజెక్టుపై రాజకీయాలకు అతీతంగా అందరూ ఏకమై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, సాగు, తాగునీటి కోసం దేవరకొండ, మునుగోడు ప్రజలు జెండాలు పక్కనపెట్టి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించకపోవడం బాధాకరమని అన్నారు.



# డిపిఎల్ క్రికెట్ మైదానాన్ని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయాలి : మెట్టు వెంకట రామిరెడ్డి

**చింతలపాలెం (జనంసాక్షి):**
సూర్యాపేట జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందిన దొండపాడు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ గత 10 సంవత్సరా లుగా గ్రామ యువతలో క్రీడాస్ఫూర్తినీ, స్నేహ భావనను పెంపొందిస్తూ విజయ వంతంగా కొనసాగుతోంది. దొండపాడు ప్రీమియర్ లీగ్ నిర్వహణకు అవసరమై న క్రికెట్ మైదానాన్ని అందించిన పరిశ్ర మల యాజమాన్యాలకు ఈ సందర్భం గా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. అయితే, మైదానాన్ని కేవలం టోర్నమెంట్ల నిర్వహణకే పరిమి తం చేయకుండా, గ్రామ ప్రజలందరికీ ఉపయోగపడేలా అవసరమైన మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. మైదానాన్ని సమత లంగా తీర్చిదిద్దడం, ఆటగాళ్లకు అవసర మైన సౌకర్యాలు కల్పించడం, తాగునీ రు, లైటింగ్, డ్రెస్సింగ్ రూమ్‌లు, ప్రేక్షకులకు అనువైన ఏర్పాట్లు చేయడం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. తద్వారా క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలకు కూడా ఈ మైదానం ఉపయోగపడు తుంది. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, ఆరోగ్యక రమైన జీవనశైలిని పెంపొందిస్తాయి. యువతను మత్తు పదార్థాలు, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉంచడంలో కూడా క్రీడలు కీలక పాత్ర పోషిస్తా యి. కాబట్టి పరిశ్రమల యాజమాన్యాలు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, దాతలు ముందుకు వచ్చి దొండపాడు క్రికెట్ మైదానాన్ని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని కోరుతున్నాం. ఈ మైదానం భవిష్యత్ తరాలకు క్రీడా వేదికగా, గ్రామ అభివృద్ధికి ప్రతీకగా నిలవాలి. మన గ్రామం, మన మైదానం, మన యువత భవిష్యత్తు అని తెలిపారు.

# పేదింటి ఆణిముత్యానికి వైద్య విద్యా అవకాశం

○ ప్రతిభతో ఎంబీబీఎస్ సీటు.. ఆర్థిక ఇబ్బందులతో దాతల సాయం కోసం ఎదురుచూపు! ○ నిరుపేద దళిత విద్యార్థిని ఇందు వైద్యురాలిగా ఎదిగేందుకు దాతలు అండగా నిలవాలి



**పి.ఏ.పల్లి,అక్టోబర్ 17 (జనంసాక్షి):**
పేదరికం ప్రతిభకు అడ్డుకాదని నిరూపించింది అక్కంపల్లి గ్రామానికి చెందిన నిరుపేద దళిత విద్యార్థిని ఆకారపు ఇందు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ చదువుపై ఉన్న మక్కువతో వైద్య విద్యలో అడుగుపెట్టిన ఆమె.. నోవా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ కన్వీనర్ కోటాలో సీటు సాధించి తన కలకు తొలి అడుగు వేసింది. అయితే, వైద్య విద్యను అభ్యసించేందుకు అవసరమైన ఆర్థిక స్థోమత కుటుంబానికి లేకపోవడంతో ఇప్పుడు దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది.

**- పేదరికాన్ని జయించిన ప్రతిభ**
అక్కంపల్లి గ్రామానికి చెందిన ఆకారపు వెంకన్న- సౌశీల్య దంపతుల కుమార్తె ఇందు మాదిగ సామాజిక వర్గానికి చెందిన నిరుపేద కుటుంబంలో జన్మించింది. కుటుంబానికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోయినా, చదువుపై ఉన్న ఆసక్తి, వైద్యురాలు కావాలనే పట్టుదలతో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించింది. ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు కొండమల్లేపల్లిలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించింది. కష్టపడి చదివి ఎంబీబీఎస్ కన్వీనర్ కోటాలో సీటు సాధించి తన ప్రతిభను చాటుకుంది.

**- చదువు కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు**
కుమార్తె వైద్య విద్యలో సీటు సాధించడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అయితే, కళాశాల ఫీజులు, హాస్టల్ ఖర్చులు, పుస్తకాలు, ఇతర విద్యా అవసరాల కోసం అవసరమైన డబ్బును సమకూర్చుకోవడం వారికి భారంగా మారింది. ఆస్తిపాస్తులు, స్థిరమైన ఆదాయ వనరులు లేని కుటుంబం కావడంతో కుమార్తె వైద్య విద్యను కొనసాగించడం సవాలుగా మారింది. ప్రతిభతో సాధించిన సీటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా వృథా కాకూడదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**- దాతలే ఇందుకు అండగా నిలవాలి**
ఒక నిరుపేద కుటుంబానికి చెందిన దళిత ఆడబిడ్డ వైద్యురాలిగా ఎదగాలన్న లక్ష్యాన్ని సాకారం చేసుకునేందుకు దాతలు ముందుకు రావాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, సామాజిక సేవకులు మానవతా దృక్పథంతో స్పందించి ఇందు వైద్య విద్యకు ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు. నేడు ఇందుకు అందించే ఆర్థిక సహాయం ఆమె భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమే కాకుండా, రేపు సమాజానికి సేవలందించే వైద్యురాలిగా ఎదిగేందుకు దోహదపడుతుంది. పేదరికం కారణంగా ఒక ప్రతిభావంతురాలి వైద్య విద్యకు ఆటంకం కలగకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని పలువురు కోరుతున్నారు.

**- దాతలారా.. ఇందు వైద్య విద్యకు అండగా నిలవండి!**
ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదు.. పేదింటి ఆడబిడ్డ డాక్టర్ కావాలన్న కలను నిజం చేసేందుకు మానవతావాదులు ముందుకు రావాలి. ఆర్థిక సహాయం అందించదలచిన దాతలు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 8121592010

# రోడ్డు ప్రమాద బాధితులకు వైద్యసేవలు అందించడమే లక్ష్యం

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 17(జనంసాక్షి )**
రోడ్డు ప్రమాదాలను నివారించడం, ప్రమాద మరణాలను తగ్గించడం, బాధితులకు సకాలంలో నాణ్యమైన అత్యవసర వైద్యసేవలు అందించడం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఖమ్మం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు సూచించారు. ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడటంలో ప్రతి ఆసుపత్రి కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు పథకాల అమలుపై సూచనలు చేశారు.

**ప్రమాద వివరాల నమోదు:**
రోడ్డు ప్రమాద బాధితుల వివరాలు, గాయాల తీవ్రత, ఆసుపత్రిలో చేరిన సమయం తదితర సమాచారాన్ని సంబంధిత అంతర్జాల వేదికలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. పోలీసు, రవాణా, వైద్య ఆరోగ్య శాఖల మధ్య సమన్వయంతో సమాచారాన్ని నమోదు చేసి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు సహకరించాలి.

**నగదు రహిత అత్యవసర వైద్య చికిత్స:**
ప్రధానమంత్రి రహత్ పథకం కింద రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక ఇబ్బందుల కారణంగా అత్యవసర చికిత్స నిలిచిపోకుండా, అర్హత నిబంధనల ప్రకారం ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స అందించే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి. ఆసుపత్రులు సంబంధిత అంతర్జాల ప్రవేశ సదుపాయాలను తనిఖీ చేసి, బాధితుల గుర్తింపు సంఖ్యలను, చికిత్స నమోదు సంఖ్యలను అనుసంధానం చేస్తూ నిర్ణీత గడువులోగా వైద్య ఖర్చుల పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలి.

**రహ్-వీర్ పథకం:**
రోడ్డు ప్రమాదం జరిగిన మొదటి గంటలోపు బాధితులను ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడేందుకు సహకరించే మంచి మనసున్న వ్యక్తులకు నిబంధనల ప్రకారం రూ.25,000 నగదు ప్రోత్సాహకం అందించే పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. అర్హులైన వ్యక్తుల వివరాలను సక్రమంగా నమోదు చేసి, వారి ధ్రువీకరణ ప్రక్రియలో సంబంధిత అధికారులకు సహకరించాలని ఆసుపత్రి యాజమాన్యాలకు సూచించారు. ప్రతి ఆసుపత్రి ఒక బాధ్యతాయుత అధికారిని నియమించుకుని, పెండింగ్‌లో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని డా. రామారావు ఆదేశించారు. ఈ పథకాల అమలును కేవలం నమోదు ప్రక్రియగా కాకుండా, విలువైన ప్రాణాలను కాపాడే సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. అన్ని ఆసుపత్రులు సమన్వయంతో పనిచేసి ఖమ్మం జిల్లాను రోడ్డు ప్రమాద మరణాలు తగ్గిన ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులు, ప్రాజెక్టు నిర్వాహకుడు హరిబాబు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డా. పి. సతీష్, ఆరోగ్యశ్రీ జిల్లా నిర్వాహకుడు పి. శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ బృంద నాయకుడు బి. లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కౌన్సిలర్ దాసరి సుధారాణి భర్తదాసరి వెంకటేశ్వర్లును పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్






**కల్లూరు అక్టోబర్ 17 (జనంసాక్షి):** కల్లూరు మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ దాసరి సుధారాణి భర్త వెంకటేశ్వర్లు ఆకస్మికంగా అనారోగ్యానికి గురై గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ , వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, గుండ్ల పుల్లారావు, జిల్లెళ్ల స్వాతి భాస్కర్ రెడ్డి, ఖమ్మంపాటి రాధా వీరస్వామి, యూత్ కాంగ్రెస్ నాయకులు ధరావత్ రవికుమార్ ఇతర నాయకులు శనివారం హైదరాబాదులోని ఆసుపత్రికి చేరుకొని దాసరి వెంకటేశ్వర్లుని పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వివరాలు కౌన్సిలర్ దాసరి సుధారాణిని అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి అందిస్తున్న వైద్య చికిత్స వివరాలు తెలుసుకుని, మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

# పిట్టలదొర వేషంలో సామాజిక చైతన్యానికి శ్రీకారం

**ఖమ్మం కార్పొరేషన్ అక్టోబర్ 17 (జనం సాక్షి)**
పిట్టలదొరగా ప్రభుత్వ ఉపాధ్యాయులు రాచకొండ ప్రభాకర్ వినూత్న ప్రచారం గంజాయి డ్రగ్స్ కు దూరంగా ఉండాలి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి పిట్టలదొర వేషం హాస్యంతో కూడిన మాటలు ఆలోచింపజేసే సందేశాలు ఇలా తనదైన శైలిలో ప్రజల్లో సామాజిక చైతన్యం చేస్తున్నారు సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ సాధారణంగా వినోదాన్ని పంచే పిట్టలదొర వేషధారణకు సామాజిక బాధ్యతను జోడించారు మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని వాటి వల్ల కలిగే సామాజిక ఆర్థిక మానసిక శారీరక అనర్థాలపై అవగాహన పెంచుకోవాలని సందేశం ఇస్తున్నారు. అదే సమయంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలని వాహనాలు నడిపే వారు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పిలుపునిస్తున్నారు అందరినీ నవ్విస్తూనే ఆలోచన చేస్తూ సాధారణంగా పిట్టలదొర దసరా పండుగ సందర్భంగా గ్రామాల్లో తన మాటల్లో గారడీతో నవ్వులు పోయిస్తూ ఎంతో కొంత యాచనచేస్తాడు కానీ ఇక్కడ మాత్రం డ్రగ్స్ గంజాయి నివారణ మరియు రోడ్డు భద్రతపై ఆలోచించే విధంగా శనివారం ఖమ్మం జిల్లా కేంద్రంలోగల న్యూ బస్టాండ్ పరిసర ప్రాంతాలలో గంజాయి డ్రగ్స్ రోడ్డు భద్రత సందేశం మరియువినోదాత్మక




వేషధారణతో ప్రజలను ఆకట్టుకుంటూ సామాజిక సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లడమే ఈ ప్రయత్నంలోనే ప్రత్యేకత మాటల్లో హాస్యం ఉన్న సందేశంలో సామాజిక బాధ్యత కనిపిస్తుంది యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతకు ప్రాధాన్యమిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ ప్రచారం వెనకఉన్న ప్రధాన ఉద్దేశం అలానే మరుగున పడుతున్న జానపద కళలను కూడా వెలికి తీయడం తన వంతు బాధ్యతగా భావిస్తున్నాను.

## జగన్నాథపురంలో ఎల్‌నినో ప్రభావంపై అవగాహన సదస్సు



**చింతకాని , అక్టోబర్ 17 (జనంసాక్షి)**
చింతకాని మండలం జగన్నాథపురం రైతు వేదికలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మధిర ఏడీఏ ఐ. వాణిశ్రీ, మండల వ్యవసాయ అధికారి పి. సతీష్ మాట్లాడుతూ తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. వరికి బదులుగా పెసర, మినుము, జొన్న, సజ్జ, రాగి వంటి పంటలను సాగు చేయడం ద్వారా పెట్టుబడులు తగ్గించి, నీటి కొరతను అధిగమించవచ్చని తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు, సబ్సిడీ సౌకర్యాలు వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్, ఇరిగేషన్ అధికారులు, సర్పంచులు తాళ్లూరి స్వాతి, కంచం ద్రౌపది, ఎస్‌కే రహమతుల్లా, చపలమడుగు వీరబాబు, కొమ్ము ప్రభు, ఆత్మ డైరెక్టర్ తోటకూరి ప్రగతి, ఏఎంసీ డైరెక్టర్ బందెల నాగార్జున, ఏఈఓ బి. కార్తీక్, ఎస్‌కే అయేషా ఫాతిమా, రైతులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో ప్రజాస్వామ్యం

○పాలకుల నియంతృత్వంపై కవుల గళం
○ప్రజాస్వామ్య పరిరక్షణకు కవులు, రచయితలు ఉద్యమాలకు అండగా నిలవాలి

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 17(జనంసాక్షి):**
ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య విలువలు దాడికి గురవుతున్నాయని, ప్రజల హక్కులను హరించే పాలకుల నియంతృత్వ ధోరణులతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్టు ఎన్. తిర్మల్ ఆందోళన వ్యక్తం చేశారు. అధికారమే పరమావధిగా పాలకులు వ్యవహరిస్తూ నిరసన హక్కులను కాలరాస్తున్నారని, స్వతంత్ర వ్యవస్థలను రాజకీయ ప్రయోజనాలకు పావులుగా మారుస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు, కవులు, రచయితలు గొంతెత్తాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. వికాస వేదిక సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం పల్లెగూడెంలో ప్రముఖ కవి బుక్కా సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన 'ప్రజాస్వామ్యమా.. వర్ధిల్లు!' కవి సమ్మేళనాన్ని ప్రారంభించి ఆయన ప్రసంగించారు. అంతర్జాతీయంగా ప్రజాస్వామ్య సూత్రాలను ఉల్లంఘిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధోన్మాద ధోరణులతో ప్రపంచ దేశాలను, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. దేశంలో నిరసన తెలిపే హక్కులను కాలరాయడం, స్వతంత్ర వ్యవస్థలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం ప్రజాస్వామ్యానికి విఘాతమని పేర్కొన్నారు. ఓటు హక్కును మరింత సరళీకృతం చేయాల్సిన ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియతో సంక్లిష్టత పెంచుతోందని అన్నారు. రాష్ట్రంలోనూ అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయాలు, అవినీతి ఆరోపణల్లో మునిగిపోయాయని విమర్శించారు. ప్రజాస్వామ్య హననం నుంచి భవిష్యత్తు తరాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. వికాస వేదిక గౌరవ సలహాదారు సృజన్‌కుమార్ మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ, ఆరోగ్య, సామాజిక రంగాల్లో ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలుగుతోందన్నారు. వికాస వేదిక రాష్ట్ర కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్ మాట్లాడుతూ కవులు, రచయితలు ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచి ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఆ బాధ్యతను విస్మరిస్తే భవిష్యత్తు తరాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. 'నా ఉనికి ఎక్కడ?' అనే కవితతో కవి సమ్మేళనం ప్రారంభమైంది.

**కవితలతో ప్రజాస్వామ్యంపై చైతన్యం**
యడవల్లి శైలజ అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో ప్రముఖ కవి వి. లక్ష్మీనరసింహాచారి 'తులసి' కవితను వినిపించారు. రచయిత ముందుశ్రీ 'మానవత్వం?మంచితనం' కవిత ద్వారా మానవీయ విలువల ప్రాధాన్యాన్ని వివరించారు. బాలకవి జోసాయి 'ప్రజాస్వామ్యం వర్ధిల్లు' కవితను చదివి వినిపించగా, రాజేంద్ర 'నిష్పాక్షికంగా' కవితలో పాలకుల నియంతృత్వ ధోరణులను ప్రశ్నించారు. ఎస్‌కే. సలాం తన కవితలో ధనస్వామ్యం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. యువ రచయిత గుడిసె రాజశేఖర్ 'ఉదయిస్తూనే ఉన్న' కవితలో వివక్ష, హక్కుల హరణపై స్పందించారు. మోహియుద్దీన్, పంజాల ఐలయ్య, కొత్తపల్లి కృష్ణారావు 'ప్రజాస్వామ్యమా.. నీవెక్కడ?' అనే కవితను వినిపించారు. ఈ కార్యక్రమం లో గరిడేపల్లి శోభనాద్రి, మందుల వీరభద్రం, చింతమల్లి సునీత, రెంటాల చిన్న హుస్సేన్, తిరునగరి శ్రీనివాస్, గండ్ల రాజేందర్ తదితరులు ప్రజాస్వామ్య విలువలు, ప్రజల హక్కులపై తమ కవితలను వినిపించారు. వికాస వేదిక సభ్యులు మల్లయ్య, రాజయ్య ఓటు చైతన్యాన్ని పెంపొందించే పాటలు పాడారు.



# వరి వద్దు.. ఆరుతడి ముద్దు

- వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్ కే. సురేంద్రమోహన్
- ఆరెగూడెంలో వాడిపోయిన పత్తి పంటల పరిశీలన
- నివేదిక పంపుతామని రైతులకు భరోసా



చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 17(జనంసాక్షి)

ఎల్ నినో ప్రభావం, వర్షపాత లోటు నేపథ్యంలో రైతులు సాంప్రదాయ వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో ఎక్కువ లాభాలు ఇచ్చే ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి శ్రీ కే. సురేంద్రమోహన్ ఐఏఎస్ సూచించారు. శనివారం చౌటుప్పల్ మండలంలోని ఆరెగూడెం గ్రామంలో ఎల్ నినో ప్రభావంతో ఎండిపోయి, వాడిపోతున్న పత్తి పంటలను ఆయన అధికారుల బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాల్లోకి వెళ్లి పత్తి చేలను చూసిన ఆయన, అక్కడే రైతులతో ముచ్చటించారు. వర్షాలు లేక తాము పడుతున్న ఇబ్బందులను, పెట్టిన పెట్టుబడులను కూడా దక్కే పరిస్థితి లేదని రైతులు కమిషనర్ దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. ప్రస్తుత పంట పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి త్వరలోనే నివేదిక పంపిస్తామని, రైతులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**ఆయిల్ పామ్, పట్టు పరిశ్రమతోనే అధిక ఆదాయం**

రైతులు ఒకే రకమైన పంటలు వేసి నష్టపోకుండా లాభసాటి ప్రత్యామ్నాయాల వైపు మళ్లాలని సురేంద్రమోహన్ పిలుపునిచ్చారు. వరికి బదులుగా ఆయిల్ పామ్ తోటల సాగు చేపడితే దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం వస్తుందన్నారు. రైతులంతా ఉమ్మడిగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్ పి ఓ)గా ఏర్పడాలని కోరారు. ఈ సంఘాల ద్వారా పట్టు పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలని, పంట ఉత్పత్తులను దళారీల ప్రమేయం లేకుండా రైతులు స్వయంగా కొనుగోలు, విక్రయాలు చేసుకుంటేనే గరిష్ట లాభాలు సాధించగలరని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె. హేమలత, మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, ఉద్యాన అధికారి శ్రీమతి కవిత, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీమతి వెన్నెల, స్థానిక నాయకులు ఎన్నవల్లి వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ నిమ్మల సత్యనారాయణ,గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మహిళను బెదిరించిన కేసులో వ్యక్తి అరెస్ట్



రామన్నపేట, అక్టోబర్ 17 (జనంసాక్షి):

మహిళను మోసం చేసి 12 ఏళ్లుగా శారీరక సంబంధం కొనసాగించడంతో పాటు, కేసులు ఉపసంహరించుకోవాలని బెదిరించిన ఆరోపణలపై రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామానికి చెందిన ముక్కామల దుర్గయ్య (49)ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిపై చర్యలు తీసుకున్నట్లు రామన్నపేట ఎస్సై సతీష్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. దుర్గయ్య తన భార్య చనిపోయిందని, తనకు ఎవరూ లేరని ఓ మహిళను నమ్మించి గత 12 ఏళ్లుగా ఆమెతో శారీరక సంబంధం కొనసాగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో బాధితురాలు గర్భం దాల్చగా, ఆమెకు బలవంతంగా అబార్షన్ చేయించినట్లు బాధితురాలు ఫిర్యాదు మేరకు అతనిపై అత్యాచారం కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో ఉండగానే దుర్గయ్య భార్య బతికే ఉందని, అతనికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారని బాధితురాలికి తెలియడంతో ఇద్దరి మధ్య వివాదం తలెత్తినట్లు సమాచారం.

**కేసు వెనక్కి తీసుకోవాలని బెదిరింపులు**

తనపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని దుర్గయ్య ఫోన్ ద్వారా బెదిరించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన సెల్‌ఫోన్‌లో ఉన్న బాధితురాలి నగ్న చిత్రాలను ఇతరులకు చూపించి ఆమె పరువు తీస్తానని, ఆమె కుమార్తెను చంపుతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు సంకలబుడ్డి సైదులుకు నివాళులు



నేరేడుచర్ల అక్టోబర్ 17 ( జనంసాక్షి ):

మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు సంకలబుడ్డి సైదులు అకాల మృతికి బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పిల్లుట్ల రఘు సంతాపం వ్యక్తం చేశారు.శనివారం మృతుడి కుటుం బాన్ని పరామర్శించి,కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం సైదులు భౌతికకాయంపై పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా పిల్లుట్ల రఘు మాట్లాడుతూ.... తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుడు సైదులు మృతి బాధాకరమన్నారు.ఈ కష్టకాలంలో వారి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని,పార్టీ తరఫున అన్ని విధాలా తోడుగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ ఉద్యమ నాయకుడు,అడ్వకేట్ నగేష్ రాథోడ్,మాజీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు లావుడియా శ్రీను నాయక్,నియోజకవర్గ నాయకుడు ముల్కలపల్లి రాం బాబు,మాజీ సర్పంచ్ పల్లెపంగు నాగరాజు,జీలకర్ర రామ స్వామి, సురబి సైదులు,జంపాల వెంకన్న,ఉంకల భాస్కర్, బుడిగె వెంకన్న,బుడిగె సతీష్,మాజీ సర్పంచ్ మేకపోతుల సైదులు,హుస్సేన్,శివాజీ తదితర గ్రామ బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.





## సుందరయ్య నగర్ లో ఘనంగా అన్నదాన కార్యక్రమం

- దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం..
- ఆర్ఆర్ యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదానం..

మణుగూరు, అక్టోబర్ 17 (జనంసాక్షి):

దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా మండపాల వద్ద నిత్య పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం మణుగూరు మండలంలో పలు చోట్ల అన్నదాన కార్యక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థిస్తూ ఈ అన్నప్రసాద వితరణ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎక్కడైనా ప్రసాద వితరణ జరిగింది అంటే అక్కడ భక్తి భావంతో తీసుకోవడమే అలాగే ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అంటే సాక్షాత్తు ఆ భగవంతుడికి సేవ చేయడమే.ఆకలితో ఉన్నవారి కడుపు నింపడం వల్ల లభించే పుణ్యం, ఎన్నో పాపాలను తొలగిస్తుందని నమ్ముతారు. అన్ని దానాలకు కన్న అన్నదానం మిన్న మిగిలిన దానాల వల్ల మనుషులలో ఇంకా కావాలనే కోరిక కలగవచ్చు, కానీ అన్నదానం మాత్రమే ఒక వ్యక్తిని "చాలు, ఇక వద్దు" అనేంతగా పూర్తి తృప్తిని ఇస్తుంది.ఈ దానంలో పేద, ధనిక అనే బేధం ఉండదు. అందరికీ సమానంగా ప్రసాదం అందుతుంది.మండపాల వద్ద ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా స్థానిక యువతలో స్వచ్ఛంద సేవాభావం, తోటి వారికి సహాయం చేయాలనే గుణం పెరుగుతాయి. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ యూత్, మండపాల నిర్వాహకులు భక్తులు ప్రజలు అమ్మవారి మాలధార మాతలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అర్వపల్లిలో ఎం సీపీఐయూ వ్యవస్థాపకుడు ఓంకార్ వర్ధంతి

జాజిరెడ్డిగూడెం మండల అక్టోబర్ 17 (జనంసాక్షి):

ఎం సీ పీఐయూ వ్యవస్థాపకుడు మద్దికాయల ఓంకార్ 18వ వర్ధంతిని శనివారం అర్వపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఈదురు వీరపాపయ్య, వేముల పెదనర్సయ్య, కొప్పొజు యాదగిరి, వెంకటేశ్వర్లు, మహేష్, రాజ్‌కుమార్, శ్రీనివాసులు, కొమరయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



# హనుమ విజయగాథకు ప్రతిరూపం సుందరకాండ

### మారుతి సదనంలో భక్తిశ్రద్ధలతో రామాయణ మహాపారాయణం

భద్రాచలం అక్టోబరు 17 (జనంసాక్షి)

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రామాయణ మహాపారాయణంలో భాగంగా శనివారం మారుతి సదనంలో ఆరో రోజు సుందర కాండ పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని భక్తిపారవశ్యంలో మునిగి పోయారు. వాల్మీకి రామాయణంలోని సుందర కాండకు విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. సీతమ్మ జాడను అన్వేషిస్తూ సముద్రాన్ని దాటి లంకకు చేరుకున్న హనుమంతుడు, అశోకవనంలో సీతాదేవిని దర్శించి శ్రీరాముని సందేశాన్ని అందించడం, లంకలో తన పరాక్రమాన్ని చాటడం వంటి ఘట్టాలు ఇందులో ప్రధానంగా వర్ణించబడ్డాయి. హనుమంతుడి భక్తి, ధైర్యం, కార్యదీక్ష, శ్రీరాముడిపై అచంచలమైన విశ్వాసం భక్తులకు స్ఫూర్తినిస్తాయని, సుందరకాండ పారాయణం మనోధైర్యం, ఆత్మవిశ్వాసం, భక్తి భావాన్ని పెంపొందిస్తుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో మారుతి సదనంలో నిర్వహించిన పారాయణంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో రామాలయం స్థానాచార్యులు కేశ స్థలశాయితో పాటు వైదిక బృందం, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.





## విజయలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

భద్రాచలం అక్టోబరు 17 (జనంసాక్షి)

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం లక్ష్మీ తాయారు అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి సహస్రధారాభిషేకం, ప్రత్యేక అర్చన, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో విజయలక్ష్మి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు.



## దమ్మాయిగూడెం సమీపంలో
# రహదారి గుంతలకు కాంక్రీట్‌తో మరమ్మతులు




○ప్రజల భద్రతే లక్ష్యంగా ముందడుగు..
○ప్రమాదాల నివారణకు ప్రత్యేక చొరవ
○ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగిన
○కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం రాజశేఖర్ సర్పంచ్ వీరదాసు వినోద

**తిరుమలాయపాలెం, అక్టోబర్ 17 (జనంసాక్షి )**
ఖమ్మం నుంచి వరంగల్ వెళ్లే జాతీయ రహదారిపై దమ్మాయిగూడెం గ్రామ సమీపంలో ఏర్పడిన రహదారి గుంతలకు కాంక్రీట్‌తో మరమ్మతులు చేపట్టారు. రహదారిపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడే పరిస్థితులు నెలకొనడంతో పాటు, ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టం కూడా సంభవించడంతో రహదారి మరమ్మతుల అవసరం అత్యవసరంగా మారింది. గతంలో గుంతలను మట్టితో పూడ్చినప్పటికీ, కొద్దిరోజులకే మళ్లీ యథాతథ పరిస్థితి ఏర్పడటంతో సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఈసారి కాంక్రీట్‌తో మరమ్మతులు చేపట్టారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని, మానవతా దృక్పథంతో దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, ఉపసర్పంచ్ ఉన్నం రాజశేఖర్, గ్రామ సర్పంచ్ వీరదాసు వినోద ప్రత్యేక చొరవ తీసుకుని మరమ్మతుల పనులను ముందుండి చేయించారు. ప్రజలు నిత్యం ప్రయాణించే ప్రధాన రహదారిపై గుంతల కారణం గా ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటాన్ని గుర్తించి, సంబంధిత అధికారుల చర్యల కోసం ఎదురుచూడకుండా తమ వంతు బాధ్యతగా మరమ్మతులు చేపట్టడం స్థానికంగా అభినందనలు అందుకుంటోంది. రహదారిపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు తగ్గించడంతో పాటు, ప్రమాదాల ముప్పును నివారించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని, ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు గ్రామాభివృద్ధికి దోహదపడతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే, జాతీయ రహదారిపై ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు శాశ్వత మరమ్మతులు చేపట్టి, రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ మరమ్మతుల కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు వడ్డేబోయిన నరసయ్య, బత్తుల వెంకన్న, పల్లి ఉపేందర్, వినుకొండ గోపాల్, యువజన కాంగ్రెస్ నాయకులు బత్తుల రమేష్, షేక్ నాగుల్ మీరా, మోహన్, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి, వారి భద్రత కోసం స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రజా సేవే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు.



# ప్రజల భద్రతే లక్ష్యంగా ముందడుగు

వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడే పరిస్థితులు నెలకొనడంతో పాటు, ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టం కూడా సంభవించడంతో రహదారి మరమ్మతుల అవసరం అత్యవసరంగా మారింది. గతంలో గుంతలను మట్టితో పూడ్చినప్పటికీ, కొద్దిరోజులకే మళ్లీ యథాతథ పరిస్థితి ఏర్పడటంతో సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఈసారి కాంక్రీట్‌తో మరమ్మతులు చేపట్టారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని, మానవతా దృక్పథంతో దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, ఉపసర్పంచ్ ఉన్నం రాజశేఖర్, గ్రామ సర్పంచ్ వీరదాసు వినోద ప్రత్యేక చొరవ తీసుకుని మరమ్మతుల పనులను ముందుండి చేయించారు. ప్రజలు నిత్యం ప్రయాణించే ప్రధాన రహదారిపై గుంతల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటాన్ని గుర్తించి, సంబంధిత అధికారుల చర్యల కోసం ఎదురుచూడకుండా తమ వంతు బాధ్యతగా మరమ్మతులు చేపట్టడం స్థానికంగా అభినందనలు అందుకుంటోంది. రహదారిపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు తగ్గించడంతో పాటు, ప్రమాదాల ముప్పును నివారించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని, ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు గ్రామాభివృద్ధికి దోహదపడతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే, జాతీయ రహదారిపై ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు శాశ్వత మరమ్మతులు చేపట్టి, రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ మరమ్మతుల కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు వడ్డేబోయిన నరసయ్య, బత్తుల వెంకన్న, పల్లి ఉపేందర్, వినుకొండ గోపాల్, యువజన కాంగ్రెస్ నాయకులు బత్తుల రమేష్, షేక్ నాగుల్ మీరా, మోహన్, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి, వారి భద్రత కోసం స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రజా సేవే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు.

# శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణలో శ్రీ విజయ దుర్గాదేవి
## భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు



**నేరేడుచర్ల అక్టోబర్ 17 (జనంసాక్షి):**
దేవి నవరాత్రి దసరా వేడుకలలో భాగంగా ఏడవ రోజు శ్రీ విజయ దుర్గాదేవి శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణలో శనివారం దర్శనమిచ్చారు.. నేరేడుచర్ల పట్టణంలోగల శ్రీ విజయదుర్గ దేవి ఆలయం,శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయంలో ఏడవ రోజు శ్రీ దేవీ నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శ్రీ మహాలక్ష్మి దేవి అమ్మవారికి ప్రీతిగా దీర్ఘ సుమంగల్యాభివృద్ధికి, సుహాసినిలచే వివాహ ప్రాప్తికి కన్యలకు అనుకూల వరప్రాతికి సామూహిక కుంకుమార్చనలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయ అర్చకులు మొలుగు శ్రీనివాసాచార్యులు,ఉగ్రదండి శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు కుంకుమ పూజ నిర్వహించారు. నేరేడుచర్ల పట్టణంతో పాటు మండలంలోని పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు..దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా,అమ్మవారి దర్శనంతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని కనులారా తిలకించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ చైర్మన్ కొనతం ఆదిరెడ్డి, కొనతం చిన్న వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు,నాగండ్ల శ్రీధర్, బొలిశెట్టి లక్ష్మయ్య, సంకల మద్ది సత్యనారాయణ రెడ్డి, మెడిసిన మెట్ల శివ, బెల్లంకొండ శేఖర్, కొనతం రామిరెడ్డి, కొనతం శ్రీనివాస్ రెడ్డి దంపతులు, వేమిరెడ్డి శంకర్ రెడ్డి,కొనతం లచ్చిరెడ్డి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదం పంపిన నిర్వహించారు.

## కోర్టు ప్రాంగణంలో
# ఘనంగా బతుకమ్మ సంబరాలు

**రామన్నపేట, అక్టోబర్ 17 (జనంసాక్షి):**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని, రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలతో అలంకరించిన బతుకమ్మలతో కోర్టు ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సమితి చైర్మన్ జి. సబిత హాజరయ్యారు. అలాగే ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి. రత్నకుమారి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి డి. సత్తయ్య పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, పూల పండుగ విశిష్టతను చాటుతూ అందరూ కలిసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను ఈ సందర్భంగా చాటిచెప్పారు. ఈ వేడుకల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఏ. మజీద్, న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయస్థాన సిబ్బంది, పోలీసు అధికారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.



## కల్లూరు నూతన ఎస్సైగా నాగరాజు బాధ్యతలు స్వీకరణ

**కల్లూరు అక్టోబర్ 17(జనంసాక్షి)**
కల్లూరు పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా జె నాగరాజు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు కల్లూరు ఎస్ఐగా పని చేసిన డి హరిత సాధారణ బదిలీల్లో భాగంగా ఖమ్మం సీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కూసుమంచి ఎస్ఐగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న జే నాగరాజు బదిలీపైకల్లూరు ఎస్సైగా వచ్చారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ సిబ్బందితో కలిసి తమ వంతు కృషి చేస్తానని ఎస్సై నాగరాజుతెలిపారు. నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన జె.నాగరాజుకు పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నూతన ఎస్సై నాగరాజును కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొట్రు అర్జున్ రావు, యువజన నాయకులు పొట్రు చక్రి, నల్లగట్ల పుల్లయ్య తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.






# అండర్-17 క్రికెట్ జట్టుకు ఎంపికైన యశస్వికి ఘన సన్మానం
## గ్రామానికి గర్వకారణంగా నిలిచిన తాళ్లగొమ్మూరు క్రీడాకారిణి

**బూర్గంపహాడ్ అక్టోబర్ 17 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం తాళ్లగొమ్మూరు గ్రామానికి చెందిన యువ క్రీడాకారిణి చల్లకోటి యశస్వి అండర్-17 క్రికెట్ జట్టుకు ఎంపికై గ్రామానికి గుర్తింపు తీసుకురావడంతో ఆమెను ఘనంగా సన్మానించారు. చల్లకోటి సాయిబాబు, స్రవంతి దంపతుల కుమార్తె అయిన యశస్విని కుటుంబ సభ్యులు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో పట్టు శాలువాతో సత్కరించి అభినందించారు. చిన్న వయసులోనే క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తూ జట్టుకు ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తున్న యశస్వి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, జాతీయ జట్టులో స్థానం సంపాదించి తాళ్లగొమ్మూరు గ్రామం పేరును దేశవ్యాప్తంగా చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు మండల మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువకులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఎస్సై సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కొక్కిరేణి సర్పంచ్ కర్నాటి రాజేంద్రప్రసాద్

**తిరుమలాయపాలెం, అక్టోబర్ 17 (జనంసాక్షి)**

తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ నూతన సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా బాధ్యతలు స్వీకరించిన పోగుల సురేష్‌ను కొక్కిరేణి గ్రామ సర్పంచ్ కర్నాటి రాజేంద్రప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ మర్యాదపూర్వక భేటీలో గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలు, గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో కొక్కిరేణి గ్రామ ఉపసర్పంచ్ చిర్ర రాములు, వార్డు సభ్యులు గుంతేటి వెంకటేశ్వర్లు, గద్దల వెంకట్రావు, గుగ్గిళ్ల అంబేద్కర్, సిరిగద్దె ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు

**కుంకుమ పూజలు**

**సారపాకలో ఘనంగా 21వ సంవత్సరం దసరా ఉత్సవాలు**

**బూర్గంపహాడ్ అక్టోబర్ 17 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక సాకేతపురిలో వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 21వ సంవత్సరం దసరా ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు కుంకుమ పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పూజల అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్న వర్తక సంఘం నిర్వాహకులను భక్తులు అభినందించారు.

## భద్రాద్రి రామయ్య నిత్యకల్యాణం వైభవం

### గోశాల నిర్మాణానికి రూ.1,00,116 విరాళం



**భద్రాచలం అక్టోబర్ 17 (జనంసాక్షి)**

భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శనివారం స్వామివారి నిత్యకల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. శ్రీరామ సేవా మండపంలో స్వామివారిని సుందరంగా అలంకరించి వేదికపై ఆసీనులను చేశారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ తదితర వైదిక కార్యక్రమాలను నిర్వహించి, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం వేద పండితులు స్వామివారికి వేద ఆశీర్వచనాలు అందజేశారు.ఇదిలా ఉండగా, భద్రాచలం బ్రాహ్మణవీధికి చెందిన రాహుల్ దేవరాజ్, ఆశ్రిత దంపతులు తమ కుటుంబ సభ్యుల తరపున దేవస్థానం గోశాల నిర్మాణానికి రూ.1,00,116 విరాళంగా అందజేశారు. అమరవాది పురుషోత్తమాచార్యులు, మాధవీలత, వేద అమృత వర్షిణి కుటుంబ సభ్యుల తరపున ఈ విరాళాన్ని సమర్పించారు.

## గిరిజన విద్యార్థిని వైద్య విద్యకు ఐటీడీఏ రూ.50 వేల ఆర్థిక సాయం

**ఎంబీబీఎస్ చదువు కొనసాగించేందుకు చెక్కు అందజేత**



**భద్రాచలం అక్టోబర్ 17 (జనంసాక్షి)**

గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించేందుకు ఐటీడీఏ అండగా నిలుస్తోందని ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. ఇందులో భాగంగా భద్రాచలం మండలం సీతానగరం కాలనీకి చెందిన తోడం కార్తిక కు ఎంబీబీఎస్ వైద్య విద్యను కొనసాగించేందుకు రూ.50 వేల ఆర్థిక సహాయం మంజూరు చేశారు.వరంగల్‌లోని ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశం పొందిన కార్తిక, ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఆర్థిక సహాయం కోరుతూ ఐటీడీఏకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తును పరిశీలించిన ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ శనివారం ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని తల్లి సమక్షంలో రూ. 50 వేల చెక్కును అందజేశారు. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి తమ లక్ష్యాలను సాధించేలా అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందించడం గిరిజన సంక్షేమ శాఖ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా రామవరం ఆటో స్టాండ్ గుడి వద్ద మహా అన్నదాన కార్యక్రమం





**కొత్తగూడెం పట్టణం జనంసాక్షి**

దేవీ నవరాత్రులలో భాగంగా ఈరోజు రామవరం ఆటో స్టాండ్ అమ్మవారి గుడి వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరి పైన ఉండాలని అందరూ సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు ఈ కార్యక్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని పలువురు రాజకీయ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

## ఆధునిక హంగులతో ఏదులాపురం మున్సిపాలిటీ ముస్తాబు

**ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం చైర్ పర్సన్ పి.అనిత**



**ఖమ్మం రూరల్, అక్టోబర్ 17 (జనంసాక్షి):**

ఏదులాపురం మున్సిపాలిటీని ఆధునిక హంగులతో సుందరంగా తీర్చిదిద్ది రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎదులపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పి.అనిత తెలిపారు. పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రధాన కూడళ్లకు కొత్త రూపునిచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట, కోదాడ, వెంకటగిరి సర్కిళ్లలో నూతనంగా చేపట్టనున్న సుందరీకరణ పనులను మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. ప్రతిపాదిత పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మార్గదర్శకత్వంలో ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు, ప్రజలకు మెరుగైన పట్టణ సదుపాయాలు కల్పించే దిశగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. అభివృద్ధి పనుల ద్వారా మున్సిపాలిటీకి నూతన శోభ తీసుకురావడమే లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో కౌన్సిలర్లు కడవ నవీన్,బానోత్ ప్రసాద్,బుర్ర మహేష్,ఎన్. వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు: ఎమ్మెల్యే పాయం



**పినపాక, అక్టోబర్ 17 (జనంసాక్షి):** అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ పినపాక మండల జర్నలిస్ట్ జేఏసీ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పినపాకలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఊటుకూరు వెంకటేశ్వరరావు(రమణ ), కట్ట శ్రీనివాసరావు, శ్రీరామ్ బృహస్పతి, లింగారెడ్డి,సంతోష్, నిట్ట వెంకటేశ్వర్లు, సత్ర పల్లి సారయ్య, చంద్రం, యోగి, తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.



## సారపాక కోలాట బృందానికి జాతీయ పురస్కారం

**న్యూఢిల్లీలో నవంబర్ 15న అవార్డు ప్రదానం..**

**ప్రత్యేక ప్రదర్శనకు అవకాశం**

**బూర్గంపహాడ్ అక్టోబర్ 17 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాకకు చెందిన శ్రీకృష్ణం వందే జగద్గురుం కోలాట బృందం జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. సంప్రదాయ జానపద కళ అయిన కోలాటానికి విశేష సేవలందిస్తున్న ఈ బృందానికి భారతీయ కోలాట కళా రత్న జాతీయ పురస్కారం?2026 ప్రదానం చేయనున్నారు. నవంబర్ 15న న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. అదే వేదికపై ప్రత్యేక కోలాట ప్రదర్శనకు కూడా బృందం ఎంపికైంది. ఈ పురస్కారానికి సంబంధించిన ఎంపిక పత్రాలను హైదరాబాద్‌లోని అకాడమి జాతీయ కార్యాలయంలో అంతర్జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా బృంద సభ్యులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో 28 రాష్ట్రాల కళాకారులతో పాటు ఎనిమిది దేశాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువు తోకల రమేష్ మార్గదర్శకత్వంలో ముందుకు సాగుతున్న ఈ బృందం, కోలాట కళను భావితరాలకు అందించడంతో పాటు తెలుగు సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటుతోంది. మహిళా కళాకారులను ప్రోత్సహిస్తూ ప్రదర్శనలు నిర్వహిస్తున్న బృందానికి జాతీయ పురస్కారం లభించడం పట్ల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సారపాక ప్రాంతానికి చెందిన కోలాట బృందానికి జాతీయ గుర్తింపు లభించడం పట్ల స్థానిక కళాభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పురస్కారం సంప్రదాయ జానపద కళలకు మరింత ప్రాచుర్యం కల్పిస్తుందని పేర్కొంటూ, గురువు తోకల రమేష్‌తో పాటు బృంద సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

## ఖమ్మంలో ఘనంగా శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు

**ఖమ్మం, అక్టోబర్ 17( జనంసాక్షి)**

ఖమ్మం పాకబండ బజార్ బేడ బుడగ జంగాల కాలనీలో శ్రీ నవ దుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయని. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, భవానీ స్వాములతో బజన కార్యక్రమం నిర్వహించడంతో పాటు భక్తులకు మరియు భవానీ స్వాములకు అన్న ప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని నవదుర్గా ఉత్సవ కమిటీ చైర్మన్ కడవంచి బిచ్చాపతి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తి భావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యతను చాటుతాయని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అన్న ప్రసాదాల వితరణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. శ్రీ నవదుర్గా ఉత్సవ కమిటీ బేడ బుడగ జంగాల కాలనీ 4వ వార్షికోత్సవం వైస్ చైర్మన్ పస్తం తిరుపతిరావు, సిరిగిరి కృష్ణంరాజు, సాయి, మణికంఠ, చెర్రీ, తరుణ్, యస్.సాయి, దుర్గా, భవానీ, అన్నపూర్ణ, చాముండేశ్వరి, మారేమ్మ తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన యువత పోలీసు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**○ ఐటీడీఏ పీవో బి. రాహుల్ ○ 100 మంది అభ్యర్థులకు 60 రోజుల పాటు శిక్షణ**

**భద్రాచలం అక్టోబర్ 17 (జనంసాక్షి)**
పోలీసు ఉద్యోగాల సాధనకు సిద్ధమవుతున్న గిరిజన నిరుద్యోగ యువతకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచిత సెమీ రెసిడెన్షియల్ కోచింగ్ ఏర్పాటు చేసినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో గిరిజన యువతకు ఈ శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణంలో పీఎంఆర్సీ భవన సమావేశ మందిరంలో పోలీసు, ఎస్ఐ అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన నిరుపేద యువతీ యువకులకు నాణ్యమైన శిక్షణ అందించి పోలీసు ఉద్యోగాలకు సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు.
శిక్షణ కోసం మొత్తం 324 మంది దరఖాస్తు చేసుకోగా, స్క్రీనింగ్ పరీక్ష ద్వారా 100 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరిలో 67 మంది పురుషులు, 33 మంది మహిళలు ఉన్నారని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలతో పాటు స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు చెప్పారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో తరగతులు నిర్వహించడంతో పాటు ఫిజికల్ డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం శారీరక దారుఢ్య శిక్షణ ఇస్తామని వెల్లడించారు. మొత్తం 60 రోజుల పాటు కొనసాగే శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పీవో సూచించారు. క్రమశిక్షణతో పట్టుదలగా సాధన చేసి తెలంగాణ పోలీసు శాఖలో ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు చందన, పీఏటీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీరు నాయక్, ఏసీఎంవో రమేష్, క్రీడల అధికారి గోపాలరావు, సర్వేశ్వరరావు దొర, మోహన్, వసంత్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.






# ఏజెన్సీ దళితులకు రాజ్యాంగ హక్కులు కల్పించాలి

**ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి: మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు చెట్టి సురేష్**



**అశ్వపురం అక్టోబర్ 17 (జనంసాక్షి):**
ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న దళితులకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యా, ఉపాధి అవకాశాలు పూర్తిస్థాయిలో అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని మాల సంఘాల జేఏసీ పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు చెట్టి సురేష్ డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి, వారు కోల్పోయిన హక్కులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ముఖ్యంగా భూమి, విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దళితులకు అందినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చెట్టి సురేష్ స్పష్టం చేశారు. దళితుల హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూపల్లి ధ్రువకుమార్, చెట్టి మనోజ్, మేకల భాస్కర్, ఉండేటి రాజేష్, కరకపల్లి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# గుడిపల్లి సర్పంచుల ఫోరం పగ్గాలు సూరబోయిన శ్రీనివాసులుకు!

**- ఏకగ్రీవంగా ఎన్నుకున్న మండల సర్పంచులు..**

**ఐక్యతతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపు**

**గుడిపల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి):**
గుడిపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా సూరబోయిన శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని సర్పంచులందరూ ఏకాభిప్రాయంతో ఆయనను ఫోరం అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడికి దేవరకొండ శాసన సభ్యులు బాలు నాయక్,ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పలువురు సర్పంచులు అభినందనలు తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారం,గ్రామస్థాయిలో స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశగా సర్పంచుల ఫోరం సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దేవరకొండ శాసన సభ్యులు బాలు నాయక్ శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండల పార్టీ అధ్యక్షులు సతీష్ రెడ్డి,లక్ష్మి నారాయణ యాదవ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూతం సైదులు, సర్పంచులు కసిరెడ్డి శ్రావణి శ్రీనివాస్ రెడ్డి,తోటకూరి వెంకటయ్య,గూడారి మల్లిక వెంకటేశ్వర్లు,వెలుగు సైదులు,రమావత్ అనసూయ తానీషా నాయక్,మైనం రాధిక శ్రీను,రమావత్ శ్రీను, తంగిరాల కృష్ణ కుమార్,మారేపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఐటీయూలోకి కాంట్రాక్టు కార్మిక నాయకుడు సతీష్ చేరిక



**బూర్గంపహాడ్ అక్టోబర్ 17 (జనంసాక్షి)**
ఐటీసీ పీఎస్పీడీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తూ, బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం నాయకుడిగా ఉన్న సింగారపు సతీష్ శనివారం సీఐటీయూలో చేరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ సమక్షంలో ఆయన ప్రజాసంఘం సభ్యత్వం స్వీకరించగా, నాయకులు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏజే రమేష్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం సీఐటీయూ నిరంతరం పోరాడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాలు కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా ఉన్నాయని విమర్శించారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, పని గంటల భారంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని, వారికి సీఐటీయూ అండగా ఉంటుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కందాల వెంకటరెడ్డి, బత్తుల గోపాలరావు, మర్రి వెంకట్‌రెడ్డి, సుధాకర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# సారపాక సమస్యలు పరిష్కరించాలి

**- పంచాయతీ ఈవోకు బీఆర్ఎస్ నాయకుల వినతి**



**బూర్గంపహాడ్ అక్టోబర్ 17 జనంసాక్షి**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామంలో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ బీఆర్ఎస్ సారపాక టౌన్ అధ్యక్షుడు కొనకంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శనివారం గ్రామపంచాయతీ ఈవో గుగులోతు రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని, మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు చెత్త తొలగింపు, దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. అంతర్గత రహదారులకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా బతుకమ్మ పండుగను పురస్కరించుకొని బతుకమ్మ గద్దెల పరిసరాల్లో పరిశుభ్రత, విద్యుత్ దీపాలు, వీధి లైటింగ్, చెత్త తొలగింపు వంటి ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. మహిళలు, యువతులు, గ్రామ ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేడుకల్లో పాల్గొనేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, కనకాచారి, భూక్య శ్రీను, దారం కృష్ణారెడ్డి, ఆంజనేయులు, కర్రీ నాగేశ్వరరావు, పంగి సురేష్, మోహన్, గుల్ మహమ్మద్, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతీదేవి అలంకారంలో అమ్మవార్లు



**వలిగొండ, అక్టోబర్ 17 (జనం సాక్షి)**
దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు మండల కేంద్రంలోని త్రిశక్తి క్షేత్రంలో మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు విశేష అభిషేకం, లలితా పారాయణం, లక్ష పుష్పార్చన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిన్నూరి గోపాలకృష్ణ, కమలాకర్ శర్మ, అనురాధ మనోహరి, శ్రీనివాస్ గుప్త, దత్తాత్రేయ శర్మ, ప్రమోద్ ముక్కా మార్, రాకేష్ శర్మ పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టుతో సాగుకు భరోసా.. రైతు బీమా కొనసాగించాలి!

**○ మారెళ్లపాడు కుడి కాలువ పనులు ప్రారంభించాలి..**
**○ తుమ్మల చెరువును గోదావరి జలాలతో నింపాలి**

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ డిమాండ్**



**అశ్వాపురం అక్టోబర్ 17 (జనంసాక్షి):**
రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ డిమాండ్ చేశారు. కరువు పరిస్థితుల్లోనూ సాగుకు భరోసా కల్పించేలా సీతారామ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లిన ఘనత కేసీఆర్ ముందుచూపుదేనని పేర్కొన్నారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకానికి అనుసంధానంగా రైట్ కెనాల్ పనులను తక్షణమే ప్రారంభించి, గోదావరి జలాలతో తుమ్మల చెరువును నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రాజెక్టుల ద్వారా నీటిని అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా, చివరి ఆయకట్టు వరకు చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా రాజకీయ విమర్శలు, దిగజారుడు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని అధికార పార్టీ నాయకులకు హితవు పలికారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు రైతు కుటుంబాలకు భరోసా కల్పించాయని గుర్తుచేశారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన చేపడతామని కోడి అమరేందర్ హెచ్చరించారు.

# ప్రజలకు అందుబాటులోకి ఫ్రీజర్ బాక్సు



**బూర్గంపహాడ్ అక్టోబర్ 17 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం ముసలమడుగు గ్రామపంచాయతీలో కొంతకాలంగా మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్న ఫ్రీజర్ బాక్సును సర్పంచ్ పూణెం సురేంద్ర ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఫ్రీజర్ బాక్సును బాగు చేయించి తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో గ్రామ ప్రజలకు ఫ్రీజర్ బాక్సు సేవలు అందుబాటులోకి వచ్చాయి.

# మూలవిరాట్ స్పర్శ దర్శనంతో అమ్మవారి దీవెనలు

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 17 (జనంసాక్షి)**
ఖమ్మం నగరంలోనిశుక్రవరపేటలో శ్రీనిమిషాంబికా దేవి ఆలయంలో దసరా విజయదశమి పర్వదినాన కల్పించే మూలవిరాట్ స్పర్శ దర్శనం వెనుక ఒక విశిష్టమైన ఆధ్యాత్మిక సాంప్రదాయం, శతాబ్దాల నాటి సంస్కృతి మరియు ఒక బలమైన పురాణ చరిత్ర కలిగి ఉంది.దేవాలయ శాస్త్రం ప్రకారం శరన్నవరాత్రుల 9 రోజులు గర్భగుడిలో పీఠాధిపతులు, వేద పండితులు నిరంతరం జరిపే చండీ హోమాలు, మూలమంత్ర జపాలు, లలితా సహస్రనామ కుంకుమార్చనల వల్ల వెలువడే మంత్ర శక్తి అంతా గర్భగుడిలోని మూలవిరాట్ విగ్రహంలో మరియు ఆమె ముందుండే పవిత్ర శ్రీచక్రంలో నిక్షిప్తమవుతుంది.కావున దసరా రోజున ఈ పూజా ఫలం పరాకాష్ఠకు చేరుకుంటుంది. ఆ సమయంలో భక్తులు నేరుగా వెళ్లి అమ్మవారి పాదాలను లేదా శ్రీచక్రాన్ని తమ చేతులతో తాకినప్పుడు, ఆ విగ్రహంలో ఉన్న అత్యంత శక్తివంతమైన పాజిటివ్ ఎనర్జీ దివ్య శక్తి భక్తుల శరీరంలోకి ప్రవేశిస్తుంది.. సాధారణ రోజుల్లో భక్తునికి, దేవునికి మధ్య పూజారి ఒక మాధ్యమంగా ఉంటారు. కానీ విజయదశమి నాటి స్పర్శ దర్శనం ద్వారా భక్తులకు తన కష్టాన్ని, బాధను నేరుగా తల్లి పాదాల చెంత చేర్చి, క్షణ కాలంలోనే నిమిషంలోనే మనశ్శాంతిని, కోరికల నెరవేర్పును.నవరాత్రులలో భాగంగా లక్ష్మీ, సరస్వతి, దుర్గా స్వరూపాలుగా పూజలందుకున్న శ్రీనిమిషాంబికా దేవి విజయదశమి నాటికి విజయ ప్రదాయినిగా మారుతుంది. ఆ విజయ సంకేత దినాన భక్తులు ఆమెను తాకి నమస్కరిస్తే రాబోయే ఏడాది పొడవునా ఎలాంటి ఇబ్బందులు, శత్రు పీడలు ఉండవని శతాబ్దాలుగా వస్తున్న నమ్మకం అని ఆలయ చైర్మన్ నామేపల్లి మోహన్ రావు, ఆలయ అర్చకులు సీతా రామచంద్రమూర్తి తెలిపారు.. స్పర్శ దర్శనం రోజున భక్తులు తమ వెంట తెచ్చుకున్న నిమ్మకాయలను అమ్మవారి పాదాల చెంత లేదా శ్రీచక్రంపై ఉంచి, చేతులతో తాకించి తెచ్చుకున్న నిమ్మకాయను ఇంట్లో ఉంచితే దుష్టశక్తులు దరిచేరవని, వ్యాపార సంస్థలలో ఉంచితే లాభాలు వస్తాయని ఈ ఆలయానికి వచ్చే భక్తులు నమ్ముతారు..కానీ భక్తులకు ఆ ఒక్క రోజు లభించే స్పర్శ భాగ్యం కోసం దసరా నాడు ఖమ్మం నగరంలోని శుక్రవార పేట లోని శ్రీనిమిషాంబికా దేవి ఆలయం చుట్టూ భక్తులతో కిక్కిరిసిపోతుంది.



# మహాలక్ష్మి దేవిగా దర్శనం

**మేళ్లచెరువు జనంసాక్షి**
వనదుర్గ అమ్మవారి దేవస్థానంలో 28వ దసరా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఏడవ రోజు అమ్మవారు మహాలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవారికి త్రిశతీ పూజ, చండీ, మహావిద్య, రాజ శ్యామల, దశమహావిద్య పారాయణలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి చండీ నవావర్ణార్చన అనంతరం 108 మంది బ్రాహ్మణ ముత్తైదువులకు సుహాసినీ పూజ నిర్వహించారు. అమ్మవారికి మహాలక్ష్మి మంత్ర సంపుటిత శ్రీసూక్త హోమం చేశారు. సాయంత్రం అమ్మవారికి శ్రీచక్రార్చన, మంత్రపుష్పం, నీరాజనం, తీర్థప్రసాద వితరణతో కార్యక్రమాలు జరిగాయి. రేపు అమ్మవారు మహిషాసురమర్దిని దేవిగా దర్శనమిస్తారని పీఠం వారు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బ్రహ్మశ్రీ వేదమూర్తులు కొంకెపాక రాధాకృష్ణమూర్తి, సీతాకుమారి, భానుకిరణ్ శర్మ, సాయి శర్మ, రామకృష్ణ శర్మ, దీపక్ శర్మ మరియు గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



# దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని 30వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలకుర్తి వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన శ్రీదుర్గాదేవి అమ్మవారిని శనివారం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, సూర్యాపేట నియోజకవర్గం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అభివృద్ధితో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.అనంతరం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదంను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీవుల్లా, నాయకులు ముదిరెడ్డి రమణారెడ్డి, దొంతిరెడ్డి సైదిరెడ్డి, కృష్ణ, వల్దాస్ దేవేందర్,కృష్ణయ్య, వసంత సత్యనారాయణ పిళ్లై, కరుణాకర్ రెడ్డి, శ్రీధర్, సాయి తదితరులు పాల్గొన్నారు.





# జనగణన-2027 ఫేజ్-2 శిక్షణా కార్యక్రమం

## జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 17 ( జనంసాక్షి)**
జనగణన-2027 ప్రక్రియలో భాగంగా జిల్లా పంచాయతీ రీసోర్స్ సెంటర్ భవనం నందు చార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు రెండు రోజులు నిర్వహించిన ఫేజ్-2 శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసినట్లు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఏ. శ్రీనివాస్ అన్నారు. రాబోయే ఫిబ్రవరి 2027 లో జరగనున్న జనగణన క్షేత్రస్థాయి విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మాట్లాడుతూ, శిక్షణా తరగతులకు హైదరాబాద్‌లోని సెన్సస్ డైరెక్టరేట్ కార్యాలయం నుండి సెన్సస్ అధికారులు హిమవర్ష, రాజు ముఖ్య శిక్షకులుగా హాజరై, శిక్షణ ఇచ్చినట్లు అన్నారు. జిల్లా పరిధిలోని అన్ని మండలాల తహశీల్దార్ కార్యాలయాలు, మున్సిపాలిటీలు, ఖమ్మం కార్పొరేషన్ పరిధికి చెందిన చార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు జనగణన విధివిధానాలపై సమగ్ర అవగాహన కల్పించినట్లు తెలిపారు.జనగణన-2027 ప్రక్రియ దేశ ప్రగతికి, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఎంతో కీలకమైనదని అన్నారు. ఫిబ్రవరి 2027 లో జరిగే జనగణన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో సేకరించాల్సిన వివరాలు, ఫారాల నమోదు, మొబైల్ యాప్ / పోర్టల్ వినియోగం, చార్జ్ రిజిస్టర్ల నిర్వహణ తదితర సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చారన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కా ప్రణాళికతో, గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. విధుల నిర్వహణలో ఏవైనా సందేహాలుంటే ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకుంటూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రణాళిక విభాగ అధికారులు, సంబంధిత మండల, మున్సిపల్ చార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## నెల్లికల్‌లో నూతన రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ వట్టాల శ్రీను



**తిరుమలగిరి (సాగర్), అక్టోబర్ 17 (జనంసాక్షి):**
మండల పరిధిలోని నెల్లికల్ గ్రామంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వట్టాల శ్రీను లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ వట్టాల శ్రీను మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నూతనంగా పొందిన రేషన్ కార్డులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధికారి మాచర్ల సైదులు, పంచాయతీ కార్యదర్శి ద్రసు నాయక్, వార్డు సభ్యులు దండెం కాశయ్య, నర్సింగ్ శ్రీను, బెజవాడ శీను, సింగారపు శివ, కోట్ల నర్సింహారెడ్డి, వట్టాల వెంకన్నతో పాటు గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# దసరా రద్దీకి కళ్లెం.. చిట్యాలలో యూటర్న్ మూసివేత

## జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల చర్యలు



**చిట్యాల, అక్టోబర్ 17 (జనంసాక్షి):**
చిట్యాల మున్సిపాలిటీలో దసరా పండుగ సందర్భంగా జాతీయ రహదారి 65పై పెరిగే వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని చిట్యాల పట్టణంలోని ఎస్‌బీఐ వద్ద ఉన్న యూటర్న్‌ను పోలీసులు మూసివేశారు. నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. డి.ఎస్.పి శివరాం రెడ్డి, నార్కట్‌పల్లి వలయ ఇన్‌స్పెక్టర్ సురేష్, చిట్యాల ఎస్సై వెంకట్ రెడ్డి, పోలీసు సిబ్బందికి ట్రాఫిక్ నియంత్రణపై తగిన సూచనలు చేశారు. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలిస్తూ వాహనాల రాకపోకలను పర్యవేక్షించారు.

# ఐటీడీఏ పీవో క్యాంపు కార్యాలయంలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

## మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొన్న పీవో బి.రాహుల్ దంపతులు

భద్రాచలం అక్టోబర్ 17 (జనంసాక్షి)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ క్యాంపు కార్యాలయంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఐటీడీఏ నివాస గృహ సముదాయంలోని మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూల పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. పీవో బి.రాహుల్ దంపతులు మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు క్యాంపు కార్యాలయ ప్రాంగణానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. సంప్రదాయ బతుకమ్మ పాటలు, ఆడపడుచుల ఆటపాటలతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, ఆటలాడుతూ ఆనందంగా గడిపారు. రాత్రి 12 గంటల వరకు సంబరాలు కొనసాగాయి.

- మహిళల ఐక్యతకు ప్రతీక బతుకమ్మ..

ఈ సందర్భంగా పీవో బి.రాహుల్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, కుటుంబ అనుబంధాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే పూలను పూజిస్తూ, ప్రకృతి ప్రసాదించిన వనరుల పట్ల కృతజ్ఞతను చాటుకోవడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. ఇలాంటి సాంస్కృతిక వేడుకలు మహిళల మధ్య ఆత్మీయతను పెంపొందించడంతో పాటు, మన



సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. మహిళల సంతోషం, సంక్షేమం సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, వారు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ఐటీడీఏ నివాస గృహ సముదాయంలోని మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లోరైడ్ బాధితులకు దిండి నీళ్లెప్పుడు?

- ఏదుల నుంచే 30 టీఎంసీల నీరు ఇవ్వాలి
- మంత్రి జూపల్లి కృష్ణారావుకు కాంగ్రెస్ నాయకుడు జక్కలి ఐలయ్య యాదవ్ లేఖ
- ప్రాజెక్టు పనులు వేగవంతం చేసి ప్రజలకు తాగు, సాగునీరు అందించాలని విజ్ఞప్తి



**మునుగోడు, అక్టోబర్ 17 (జనంసాక్షి)**

ఫ్లోరైడ్ సమస్యతో దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్న మునుగోడు, దేవరకొండ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీరు, సాగునీరు అందించేందుకు దిండి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కాంగ్రెస్ నాయకుడు జక్కలి ఐలయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఏదుల రిజర్వాయర్ నుంచే దిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటిని అందించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుకు లేఖ రాశారు. ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**రూ.6,190 కోట్లతో ప్రారంభమైన ప్రాజెక్టు**

తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారిక వివరాల ప్రకారం, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు తాగునీరు, కరువు పీడిత ప్రాంతాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో దిండి ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. శ్రీశైలం రిజర్వాయర్ ఫోర్‌షోర్ నుంచి రోజుకు 0.50 టీఎంసీ చొప్పున 60 రోజుల్లో 30 టీఎంసీల వరద జలాలను తరలించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. 2015 జూన్ 11న ఈ ప్రాజెక్టుకు రూ.6,190 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. సుమారు 3.61 లక్షల ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కల్పించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం.

**రూ.3,187 కోట్లు ఖర్చు.. అనుమతుల కోసం ఎదురుచూపులు**

తెలంగాణ ప్రభుత్వం 2026 ఆగస్టులో విడుదల చేసిన అధికారిక సమాచారం ప్రకారం, దిండి ఎత్తిపోతల పథకంపై ఇప్పటికే రూ.3,187 కోట్లు ఖర్చు చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ అనుమతులు త్వరగా మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. అనుమతుల జాప్యంతో పనులు నిలిచిపోవడం, ప్రాజెక్టుల వ్యయం పెరగడం వంటి సమస్యలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఇప్పటికే భారీ మొత్తంలో నిధులు ఖర్చయిన నేపథ్యంలో మిగిలిన పనుల పురోగతి, అనుమతుల స్థితి, ప్రాజెక్టు పూర్తయ్యే గడువుపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**ఏదుల నుంచే నీటిని తరలించాలి**

ఏదుల రిజర్వాయర్ నుంచి దిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటిని అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు జక్కలి ఐలయ్య యాదవ్ తన లేఖలో పేర్కొన్నారు. హై లెవల్ కెనాల్, టన్నెల్ పనులను వేగవంతం చేయడంతో పాటు నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. ఏదుల నుంచి నీటిని తరలించే ప్రతిపాదనకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, నిధుల కేటాయింపు వివరాలను అధికారికంగా వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు.

అయితే, ఏదుల రిజర్వాయర్ నుంచి నీటి తరలింపుపై పేర్కొన్న తాజా నిర్ణయాలు, రూ.1,800 కోట్ల కేటాయింపునకు సంబంధించిన వివరాలను స్వతంత్రంగా నిర్ధారించే అధికారిక పత్రాలు అందుబాటులో లేవు. ఈ అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**నీటి కేటాయింపుపై స్పష్టత అవసరం**

దిండి ప్రాజెక్టు అసలు రూపకల్పనలో శ్రీశైలం రిజర్వాయర్ ఫోర్‌షోర్ నుంచి వరద జలాలను తరలించే ప్రతిపాదన ఉంది. ఈ నేపథ్యంలో ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించే ప్రతిపాదనకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, వాటి సాంకేతిక సాధ్యాసాధ్యాలు, అదనపు వ్యయంపై స్పష్టత రావాల్సి ఉంది. వివిధ ప్రతిపాదనలపై సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు అధికారిక వివరణ ఇవ్వడం అవసరం.

**రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్య పరిష్కరించాలి**

నీటి కేటాయింపుపై రాజకీయ వివాదాలు పక్కనపెట్టి, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని జక్కలి ఐలయ్య యాదవ్ కోరారు. దిండి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, హై లెవల్ కెనాల్, టన్నెల్ నిర్మాణాలను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

మునుగోడు, దేవరకొండ ప్రాంతాల్లో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడంతో పాటు సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని ఆయన కోరారు. ఫ్లోరైడ్ బాధితులకు హామీలకంటే ఆచరణాత్మక చర్యలు అవసరమని, దిండి ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో ప్రభుత్వం స్పష్టమైన కాలపట్టిక ప్రకటించాలని జక్కలి ఐలయ్య యాదవ్ విజ్ఞప్తి చేశారు.

## పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలి

## డా. చిలకల శ్రీనివాస్ యాదవ్



**చౌటుప్పల్ అక్టోబర్ 17 (జనంసాక్షి)**

ఖమ్మం–వరంగల్–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని ప్రతి అర్హుడైన పట్టభద్రుడు తన ఓటు హక్కును గుర్తించి, ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ పిలుపు నిచ్చారు. నిరుద్యోగ రహిత, సాంకేతిక ప్రగతితో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని ఆయన ఆకాంక్షించారు. శనివారం భవానీ మాలలో ఉన్న ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటు అనేది కేవలం ఎన్నికల ప్రక్రియలో భాగం మాత్రమే కాదని, ప్రజల భవిష్యత్తును ప్రభావితం చేసే విలువైన ప్రజాస్వామ్య హక్కు అని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. పట్టభద్రులు తమ సమస్యలను అర్థం చేసుకునే నాయకత్వాన్ని గుర్తించి.. అభివృద్ధి, పారదర్శకత, ప్రజాసేవకు ప్రాధాన్యతనిస్తూ ఓటుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

**ఐటీ పరిశ్రమలు స్థానికంగానే రావాలి:**

డిగ్రీలు, పీజీలు పూర్తి చేసిన యువత ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు మారాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ నియామకాలు పారదర్శకంగా జరగడంతో పాటు ప్రైవేటు రంగంలోనూ అర్హతకు తగిన ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఐటీ కంపెనీలు, సాఫ్ట్‌వేర్ సంస్థలు, స్టార్టప్‌లు కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లోనూ ఏర్పాటయ్యేలా ప్రభుత్వాలు ప్రోత్సాహక చర్యలు చేపట్టాలన్నారు. దీనివల్ల స్థానిక యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం తప్పుతుందని పేర్కొన్నారు.

**ఆధునిక సాంకేతిక విద్య అవసరం:**

గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా కంప్యూటర్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్ వంటి ఉపాధి ఆధారిత కోర్సులు అందుబాటులోకి రావాలని యాదవ్ కోరారు. చదువుతో పాటు ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించాలన్నారు. పట్టభద్రుల అభివృద్ధి కోసం ఉపాధి, సాంకేతిక విద్య, పరిశ్రమల స్థాపన, స్వయం ఉపాధికి రుణాలు–మార్కెటింగ్ సహకారం, సామాజిక చైతన్యం, ప్రజాప్రతినిధుల జవాబుదారీతనం అనే ఆరు ముఖ్యమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి అర్హుడైన పట్టభద్రుడు అధికారిక ఎన్నికల వనరుల ద్వారా నిర్ణీత విధానంలో ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలని, అలాగే తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల్లోని పట్టభద్రులకు కూడా అవగాహన కల్పించాలని డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.



## చౌటుప్పల్ రామ్‌నగర్‌లో ‘అభ్యుదయ యూత్’ నూతన కమిటీ ఎన్నిక

**చౌటుప్పల్, అక్టోబర్ 17(జనం సాక్షి)**

చౌటుప్పల్ పరిధిలోని రామ్‌నగర్‌లో అభ్యుదయ యూత్ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ సలహాదారులు చెరుకు అశోక్ గౌడ్, వర్కాల వెంకట్ కుమార్ గౌడ్,గౌరవ అధ్యక్షుడు తూర్పునూరి బాబుగౌడ్ ఆధ్వర్యంలో ఈ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.

నూతన కార్యవర్గ సభ్యులు అధ్యక్షుడు: చెవ్వగొని వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షుడు,మార్గం నరసింహ యాదవ్, ప్రధాన కార్యదర్శి తూర్పునూరి లింగంస్వామి గౌడ్,కోశాధికారి: వెంకటేష్ గౌడ్,కార్యదర్శి తూర్పునూరి చిన్న మల్లేష్ గౌడ్,కార్యనిర్వహణ కార్యదర్శి వర్కాల జయరాం గౌడ్, సలహా కార్యదర్శి చెవ్వగొని రమేష్ గౌడ్,ప్రచార కార్యదర్శి: చెరుకు రాము గౌడ్,సాంస్కృతిక కార్యదర్శులు తూర్పునూరి సాయిలు గౌడ్, బాలగోని రాంప్రసాద్ గౌడ్

కార్యవర్గ సభ్యులు తూర్పునూరి వెంకటేష్ గౌడ్, బెదరకోట వెంకటేష్, ఉష్కాకుల శ్రీశైలం గౌడ్, బందారం శివగౌడ్, చెరుకు సాయి గౌడ్, మొగుదాల రమేష్ గౌడ్, ఓదరి రాకేష్. ఈ సందర్భంగా అభ్యుదయ యూత్ నూతన అధ్యక్షుడు చెవ్వగొని వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ... కమిటీ ఎన్నికకు సహకరించిన కాలనీ పెద్దలకు, కాలనీ వాసులకు మరియు సీనియర్ యూత్ సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. రామ్‌నగర్ కాలనీ అభ్యుదయం కోసం, యువత అభివృద్ధి కోసం కమిటీ సభ్యులందరినీ కలుపుకొని బాధ్యతాయుతంగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు తూర్పునూరి పెద్ద మల్లేష్ గౌడ్, బాలగోని నరసింహ గౌడ్, తూర్పునూరి జంగయ్య గౌడ్, విశ్వరూపం చారి, చెవ్వగొని మహేష్ గౌడ్ తదితరులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

## సర్వోత్తం రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

- ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు చేయించాలి
- దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్



**పి.ఏ.పల్లి,అక్టోబర్ 17 (జనంసాక్షి):**

ఉమ్మడి నల్లగొండ?ఖమ్మం?వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పిలుపునిచ్చారు. శనివారం పి.ఏ.పల్లి, గుడిపల్లి మండలాల్లో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. త్యాగాల కుటుంబానికి చెందిన సర్వోత్తం రెడ్డికి ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి నాయకుడు,కార్యకర్త తానే అభ్యర్థిననే భావనతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులందరి ఓట్లు నమోదు చేయించే బాధ్యతను కాంగ్రెస్ నాయకులు,యువజన నాయకులు, సర్పంచులు,బూత్ లెవల్ ఏజెంట్లు సమన్వయంతో నిర్వహించాలని కోరారు. ప్రతి ఓటు పార్టీ విజయానికి కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో జిల్లా కాంగ్రెస్ నాయకులు,వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు,పట్టభద్రులు,కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.



## యాసంగిలో వరి పంటలు సాగుచేయవద్దు

## డీ ఏ ఓ శ్రీధర్‌రెడ్డి

**జాజిరెడ్డిగూడెం మండల అక్టోబర్ 17 (జనంసాక్షి):**

ఎల్ నినో ప్రభావం దృష్ట్యా యాసంగిలో రైతులు వరిపంటలు సాగుచేయవద్దని జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేక అధికారి జి.శ్రీధర్‌రెడ్డి కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. నీటి వసతి ఉన్న రైతులు ఆరుతడి పంటలు మాత్రమే సాగుచేయాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఝాన్సీ, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీఓ సందీప్, మండల అధికారులు నవీన్‌రెడ్డి, గణేష్, నవీన్, శ్రీకాంత్, బాలునాయక్, నాగయ్య, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



# బతుకమ్మ చాటిన మత సామరస్యం



**నూతనకల్ అక్టోబర్ 17 ( జనంసాక్షి)**

మేఘ, హైమన్ ఇద్దరూ మంచి స్నేహితులు వీరు గురుకుల పాఠశాలలో 6 వ తరగతి చదువు తున్నారు. ఇద్దరూ కూడా చాలా తెలివిగల అమ్మాయిలు. చదువులోనూ, ఆటల్లోనూ అందరికంటే ఎప్పుడూ కూడా ముందుండే వారు.ఎప్పటి లాగానే ఎస్ఏ 1 పరీక్షలో ఇద్దరూ కూడా ఫస్ట్ ర్యాంక్ వచ్చారు. పరీక్షలు అవ్వగానే దసరా సెలవులు మొదలు కావడం తో రాత్రి ఇద్దరూ కూడా ఇంటికి వెళ్లే హడావుడిలో బ్యాగ్ సద్దుకుంటున్నారు కానీ, హైమన్ ఏదో ఆలోచనలో పడింది గమనించిన మేఘ "ఏమైంది అలా ఉన్నావు అని అడిగింది. " బతుకమ్మ, దసరా పండుగ లు ఎలా జరుపు కుంటారు, నాకు తెలుసుకోవాలని ఉంది మేఘ" అని తన మనసులో ఉన్న మాట అడిగింది" హైమన్. హైమన్ ముస్లిం కావడంతో పండుగ ఎలా జరుపుకుంటారో తనకు తెలియదు."అయితే ఈ సారి దసరా సెలవులకు మా ఊరికి వెళ్దాం మా ఊరిలో బతుకమ్మ, దసరా చాలా బాగా జరుపు కుంటారు. మీ అమ్మా నాన్నలను అడుగుదాం " అన్నది మేఘ." అయితే! సరే మేఘ "అన్నది హైమన్. ఇద్దరూ కూడా హైమన్ ఇంట్లో వాళ్ళకు విషయం చెప్పి వారి అనుమతితో మేఘ వాళ్ళ ఊరికి బయలుదేరారు. హైమన్ కి మేఘ వాళ్ళ ఊరిలోని వాతావరణం చాలా బాగా నచ్చింది. మేఘ వాళ్ళ ఇంట్లో వాళ్ళు కూడా తనను మేఘ తో సమానం గా చూసుకోవడం ఇంకా బాగా నచ్చింది. బతుకమ్మ పండుగ మొదలయ్యింది మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ కోసం ఉదయాన్నే నిద్ర లేచి తయారయ్యి మేఘ, హైమన్ లు ఇద్దరూ రంగు రంగుల పూల కోసం తెలిసిన వాళ్ళ ఇంటికి బయలుదేరారు దారిలో ఊరిలో ఉన్న స్నేహితులకు హైమన్ ని పరిచయం చేసింది మేఘ. పూలన్నింటినీ సేకరించి ఇంటికి తిరిగి వచ్చారు. మేఘ వాళ్ళ అమ్మతో కలిసి అందమైన బతుకమ్మను పేర్చారు ఇద్దరూ. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను సాయంత్రం అవ్వగానే అందరితో కలిసి ఊరి చివర ఉన్న చెరువు దగ్గరకు వెళ్లి బతుకమ్మ పాటలు పాడుకుంటూ, చప్పట్ల తో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చాలా ఉత్సాహంగా గడిపి బతుకమ్మలనూ నీటిలో వదిలి, తెచ్చిన ప్రసాదం తిని ఇంటికి తిరిగి వచ్చారు. రోజూ బతుకమ్మ పూలు తీసుకు రావడం బతుకమ్మ పేర్చడం చెరువు దగ్గర ఆడటం చాలా బాగా అనిపించింది హైమన్ కి. అలా ఒక రోజు మేఘ వాళ్ళ పెద్దమ్మ హైమన్ ని ఇలా అడిగింది. "హైమన్ మీరు ముస్లింలు కదా! మరీ,నువ్వు బతుకమ్మ పేర్చడం లోనూ, బతుకమ్మ ఆడటంలోనూ చాలా ఉత్సాహం గా పాల్గొంటున్నావు, దేవుని ప్రసాదం కూడా ఇష్టంగా తింటున్నావు. మీ మతంలోని వారు ఇలా ఉండరు కదా, మీ ఇంట్లో వాళ్ళు ఏమనరా?" అని అడిగింది పెద్దమ్మ."అలా ఏముండదు పెద్దమ్మ ఏ మతమైనా మంచినే నేర్పిస్తుంది కదా!.మా అమ్మా నాన్నలు కూడా మాకు చిన్నప్పటి నుండి అన్నీ మతాలను గౌరవించాలి, అన్నీ మతాలు గొప్పవే అనే విషయాన్ని మాకు నేర్పించారు. మా పాఠశాలలో కూడా ఇదే చెబుతారు. బతుకమ్మ పండుగ అనేది ప్రకృతికి సంబం ధించిన పండుగనే కదా, పండుగ ఎలా జరుపు కుంటారో తెలుసుకోవాలనే అమ్మా నాన్న ల అను మతితో ఇక్కడికి వచ్చాను పెద్దమ్మ "అని చెప్పింది హైమన్. చిన్నతనంలో అన్నీ మతాలు గొప్పవే, అన్ని మతాలను గౌరవించాలి అన్న విషయం అర్థం చేసుకున్న హైమన్ మాటలకు మేఘ వాళ్ళ పెద్దమ్మ తో పాటు ఇంట్లో వాళ్ళంతా సంతోషించారు. చివరి రోజు సద్దుల బతుకమ్మను కూడా చాలా ఘనంగా జరుపుకున్నారు. దసరా పండుగ రోజు పాలపిట్టను చూసి,జమ్మి దగ్గరకు వెళ్లి అలాయ్ బలయ్ ఇచ్చి పుచ్చుకున్నారు. సెలవులు ముగియడంతో మేఘ, హైమన్ లు పాఠశాలకు తిరిగి వెళ్ళడానికి సిద్ధం అయ్యారు . ఈసారి రంజాన్ పండుగకు మేఘను తన తో పాటు తమ ఇంటికి పంపాలని మేఘ వాళ్ళ అమ్మా నాన్న ల అనుమతి తో పాటు, వాళ్ళ ఆశీర్వాదం కూడా తీసుకొని మేఘ, హైమన్ లు తిరిగి గురుకుల పాఠశాలకు బయలుదేరారు.

# కవులు రచయితల జిల్లా కార్యవర్గంలో తుంగతుర్తి వాసులకు చోటు





**తుంగతుర్తి అక్టోబర్ 17 (జనంసాక్షి)** సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన జిల్లాలోని నాలుగు నియోజక వర్గాలకు చెందిన కవులు రచయితలు పాల్గొని, సూర్యాపేట జిల్లా రచయితల సంఘం కార్యవర్గంలో తుంగతుర్తి ప్రాంతానికి ప్రాధాన్యం లభించింది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా పిల్లలమర్రి పినవీరభద్రుని కళా పీఠం అధ్యక్షులు మరియు సూర్యాపేట నియోజకవర్గం రచయితల సంఘం అధ్యక్షులు శ్రీ శీల అవిలేను ఉపాధ్యక్షులుగా తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన తుంగతుర్తి నియోజకవర్గం రచయితల సంఘం అధ్యక్షుడైన, డాక్టర్ ఎర్ర హరికిషన్ ను ఎన్నుకున్నారు. కాగా శీల అవి లేను తుంగతుర్తి మండలంలో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు, ఎర్ర హరికృష్ణ నాగారం మండలంలో గణిత ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు,వి ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



# గుడిపల్లిలో ఘనంగా వెన్నముద్దల "బతుకమ్మ" సంబరాలు

**పి.ఏ.పల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి ):**

గుడిపల్లి మండలంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం యందుస్థానిక ఎంపిడిఓ అబ్దుల ఆధ్వర్యంలో వెన్నముద్దల "బతుకమ్మ" సంబరాలు ఘనంగా నిర్వహించారు.మండలంలోని వివిధ గ్రామ పంచాయతీ కార్యదర్శులు,ఏపిఓ,మహిళా సమాఖ్య సభ్యులు బతుకమ్మ చుట్టూ ఆట పాటల తో నృత్యం చేయడంతో కార్యాలయం వద్ద సందడి నెలకొంది.దీంతో చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి,మండలంలోని సర్పంచులు కసిరెడ్డి శ్రావణి శ్రీనివాస్ రెడ్డి, సూరం బోయిన శ్రీనివాసులు, దూదిపాల అశ్విని రాజేందర్ రెడ్డి, రమావత్ శ్రీను,తోటకూరి వెంకటయ్య, మైనం రాధిక శ్రీను,రమావత్ అన సూయ తానీషా నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూతం సైదులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయం సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



# బుల్లెట్ ట్రైన్ మొదటి అలైన్మెంట్‌కు బీజేపీ కట్టుబడి ఉంది

**సూర్యాపేట (జనంసాక్షి):**

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన బుల్లెట్ ట్రైన్ ప్రధాన పట్టణాలు జాతీయ రహదారి 65కు సమాంతరంగా కొనసాగేందుకు బీజేపీ కట్టుబడి ఉందని, అపోహలు నమ్మవద్దని మల్కాజ్ గిరి ఎంపీ,కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు.సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ, బీజేపీ జిల్లా కమిటీ సంయుక్తంగా శనివారం హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసి సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కారిడార్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు.బుల్లెట్ ట్రైన్ పక్కదారి పట్టిస్తున్న విషయంపై కమిటీ సభ్యులు వారికి విన్నవించారు.రాష్ట్రంలో బిజెపి ఎంపీలు, మంత్రులు, కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యుల కు తెలియకుండా రూటు ఎలా మారుస్తారని అన్నారు.బుల్లెట్ ట్రైన్ ఎప్పుడైనా వాణిజ్య పట్టణాలు, నగరాలను కలుపుకొని వెళ్తుందని అన్నారు.బీజేపీ ప్రభుత్వం బుల్లెట్ ట్రైన్ మొదటగా మంజూరు చేసిన విధంగా జాతీయ రహదారి 65కు సమాంతరంగా సూర్యాపేట మీదుగా కొనసాగేందుకు, కారిడార్ ఏర్పాటు చేసేందుకు కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు.త్వరలో కేంద్ర రైల్వే శాఖ మంత్రికి ఇక్కడ జరుగుతున్న బుల్లెట్ ట్రైన్ దారి మళ్లింపు ప్రచారంపై జేఏసీ తెలిపిన వివరాలను, సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ రైల్వే కారిడార్ ఏర్పాటుపై వారి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమ నాయకులను కేంద్ర రైల్వే మంత్రికి కల్పించనున్నట్లు తెలిపారు.ఈటల రాజేందర్ ను కలిసిన వారిలో బుల్లెట్ ట్రైన్ సాధన కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి, మల్లు నాగార్జున రెడ్డి, ధర్మార్జున్, వెలుగు వనిత, బూర వెంకటేశ్వర్లు, జర్నలిస్టు భూపతి రాములు, బిజెపి జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతా రెడ్డి, కడియం రామచంద్రయ్య ,తుక్కాని మన్మథ రెడ్డి, వంగవీటి శ్రీనివాసరావు,దండ మురళీధర్ రెడ్డి,దండ శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, శుక్ర నాయక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మహాలక్ష్మి దేవిగా అమ్మవారి దర్శనం

## మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు



**రామన్నపేట, అక్టోబర్ 17 (జనంసాక్షి):** రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలోని శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ఏడవ రోజు శనివారం శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పున్న రామ లక్ష్మయ్య ధర్మపత్ని సరస్వతి కుమారుడు సిరిపురం చేనేత సహకార సంఘం కోశాధికారి పున్న అమరేందర్ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో సిరిపురం శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ రాపోలు రమేష్, దాసిరెడ్డి వెంకటరమణ, అప్పం గోయల్ మాజీ వార్డ్ మెంబర్ పున్న వెంకటేశం దేవాలయ ప్రధాన అర్చకులు జెల్ల అంజయ్య, గోపాలచార్యులు అప్పం రాములు శాస్త్రి చిన్నోజు సత్యనారాయణ, ఉపేంద్ర చారి, సింగం వినయ్ కుమార్, జెల్ల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుపై చిరుమర్తి లింగయ్య ప్రచారం



**చిట్యాల, అక్టోబర్ 17 (జనంసాక్షి)**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నల్లగొండ జిల్లా చిట్యాలలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రచారం నిర్వహించారు. పలువురు పట్టభద్రులను కలిసి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన పట్టభద్రులతో ఓటరు నమోదు చేయించారు. ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. నిరుద్యోగులకు భృతి కల్పిస్తామని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, వాటి అమలులో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో నిరుద్యోగులు, పట్టభద్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటరు జాబితాలో పేరు నమోదైందో లేదో పరిశీలించు కోవాలని, నమోదు కానివారు నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి పట్టభద్రులు ఓటు వేసి గెలిపించాలని చిరుమర్తి లింగయ్య కోరారు.

# పంచాయతీ కార్యదర్శి నూతన భవనం ప్రారంభం

**మాడుగులపల్లి అక్టోబర్ 17 జనంసాక్షి:**

మాడుగులపల్లి మండలం నారాయణపురం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం కోలాహలంగా జరిగింది ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వంశీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు నూతన భవనంలో పంచాయతీ కార్యదర్శిని ఆయన నూతన కుర్చీలో ఆసీనులను చేసి, పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నూతన భవనం అందుబాటులోకి రావడం వల్ల గ్రామ ప్రజలకు పంచాయతీ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందుతాయన్నారు స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు సతీష్ రెడ్డి, శ్రవణ్ కుమార్, నరేష్, రామ్ రెడ్డి, సైదులు, రమేష్ మరియు గ్రామ నాయకులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



# భవిష్యత్తు తరాలకు చక్కటి వాతావరణం అందించాలనేది మొక్కలతోనే సాధ్యం

## 14వ వార్డ్ కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్




**చౌటుప్పల్, అక్టోబర్ 17(జనం సాక్షి)**
భవిష్యత్తు తరాలకు చక్కటి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం కేవలం చెట్లతోనే సాధ్యమవుతుందని చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 14వ వార్డు కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్ అన్నారు. శనివారం వార్డులోని గౌడ సంఘం ఆవరణలో మున్సిపాలిటీ తరపున కాలనీవాసులకు రెండు రకాల చెత్తబుట్టలను, ప్రతి ఇంటికి ఒక మొక్కను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉడుగు జ్యోతి మాట్లాడుతూ.. ప్రజలు ఎవరూ కూడా చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని, ఇళ్లు మరియు పరిసర ప్రాంతాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అందుకోసమే మున్సిపాలిటీ తరపున రెండు చెత్తబుట్టలను అందజేస్తున్నామని తెలిపారు. ఒక బుట్టలో తడి చెత్త, మరో బుట్టలో పొడి చెత్తను విడివిడిగా వేసి మున్సిపాలిటీ స్వచ్ఛ వాహనానికి అందించాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఇంటికి ఒక మొక్కను అందిస్తున్నామని, వాటిని కేవలం నాటడమే కాకుండా బాధ్యతగా సంరక్షించాలని కాలనీవాసు లను కోరారు. ఈ కార్యక్రమంలో సీతారామచంద్ర స్వామి దేవాలయ డైరెక్టర్ వర్కాల రవి గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, దొడ్డి గణేష్, నందగిరి సాయి గౌడ్, మండలోజు మనోజ్ చారి, వన సంరక్షణ అధికారి వేణు, శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్, వార్డు అధికారి కిరణ్, బిల్లు కలెక్టర్ వెంకటేష్, జవాన్ నరసింహ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.



# మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన సంతోషి మాత

**సూర్యాపేట (జనంసాక్షి):**
దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శని వారం జిల్లా కేంద్రంలోని సంతోషిమాత దేవాలయంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీహోమం, రుద్రహోమం, సామూహిక కుంకుమార్చన, శ్రీచక్ర యంత్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల భాగంగా బ్రాహ్మణ ముత్తైదువకు సుహాసిని పూజ, మంగళనీరాజనం మంత్రపుష్పాలతో అమ్మవారిని కీర్తిస్తూ పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షులు బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, ప్రధాన కార్యదర్శి పబ్బా ప్రకాశరావు, కోశాధికారి కొత్త మల్లికార్జున్, యమా వెంకటేశ్వర్లు,ఉత్సవ నిర్వాహకులు గోపారపు రాజు, అలంకరణ భక్తులు రాచర్ల వెంకటేశ్వర రావు, మిరియాల శివ కుమార్, రాచర్ల కమలాకర్,దారం వెంకన్న, ఎర్రమల్ల ప్రసాద్, నూనే ప్రభాకర్, కమిటీ సభ్యులు కక్కిరేణి పద్మ, కనకరత్నం,పల్లవి,కవిత, నీరజ,నవ్య, కంచర్ల లీల, విజయ లక్ష్మి,అర్చకులు అశోక్ మిశ్రా, రాఘవాచార్యులు, దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు తప్పనిసరి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యం
- ఇస్లావత్ రాంచందర్ నాయక్
- సత్యం పహాడ్ తండాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమం



**హాలియా అక్టోబర్ 17 జనంసాక్షి :**
నల్లగొండ జిల్లా, , త్రిపురారం మండలం పరిధిలోని సత్యం పహాడ్ తండా గ్రామపంచాయతీలో ఖమ్మం?నల్గొండ?వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ట్రైకార్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు శ్రీ ఇస్లావత్ రాంచందర్ నాయక్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులకు, యువకులకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు పూర్తి కావాలని, దీనికోసం నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.
రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వైద్యులు, ఇతర అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారిని నేరుగా కలిసి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదవ్వే వరకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, ఇంటింటికీ వెళ్లి కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులను కోరారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులైన పట్టభద్రులు దసరా సెలవుల సందర్భంగా స్వగ్రామాలకు వచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా, వారిని సంప్రదించి ఓటరు నమోదు చేయించేందుకు నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని రాంచందర్ నాయక్ పిలుపునిచ్చారు. ప్రతి అర్హుడైన పట్టభద్రుడిని గుర్తించి, వారి ఓటరు నమోదు పూర్తి చేయించే బాధ్యతను పార్టీ శ్రేణులు సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లు ప్రారంభం



**సూర్యాపేట (జనంసాక్షి):**
సూర్యాపేట మండలం బాలెంల గ్రామ సమీపంలో మంజీత్ కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ లో పత్తి కొనుగోళ్లు ప్రారంభమైనట్లు నిర్వాహకులు తెలిపారు. రైతులు నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని అన్నారు. రైతులు పత్తిని తీసుకొని వచ్చే టప్పుడు తేమ శాతం, పొడవు, మైక్రోనైర్ విలువ వంటి ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. పత్తిని బాగా ఆరబెట్టి, శుభ్రం చేసిన తర్వాతే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని కోరారు. పత్తిని విక్రయించేటప్పుడు రైతులు తమ యొక్క ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, పహాని లేదా పట్టాదారు పాస్ పుస్తకం జీరాక్స్ లను తమ వెంట తీసుకురావాలని సూచించారు. పత్తి విక్రయాలలో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

# మైసమ్మ కాలనీలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

## ప్రత్యేక పూజలు నిర్వహించిన చిన్నపాక పద్మావతి శ్రీనివాస్

### కాలనీకి హైమాస్ లైట్ ఏర్పాటుకు హామీ

**రామన్నపేట, అక్టోబర్ 17 (జనంసాక్షి):**
మండలంలోని ఇంద్రపాలనగరం మైసమ్మ కాలనీలో శ్రీశ్రీశ్రీ మైసమ్మ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 14వ వార్షికోత్సవ శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్నపాక పద్మావతి శ్రీనివాస్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మైసమ్మ కాలనీ గ్రౌండ్‌లో భక్తులకు, కాలనీ ప్రజలకు పండుగల సమయంలో రాత్రి వేళల్లో ప్రజలు పెద్ద ఎత్తున గుమిగూడుతారు. ఆ సమయంలో ఈ లైట్లు ఉపయోగపడే విధంగా హైమాస్ లైట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. చిన్నపాక పద్మావతి శ్రీనివాస్ కు శ్రీ దుర్గామాత కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులతో వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.





# ఆధ్యాత్మికతతో మనస్సు ప్రశాంతత

## మండల ప్రత్యేక అధికారి ఎంఏ భారతి

**నూతనకల్, అక్టోబర్ 17 (జనం సాక్షి)**
ఆధ్యాత్మికతతో మనసుకు ప్రశాంతత లభిస్తుందని మండల ప్రత్యేక అధికారి ఎంఏ భారతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీమాతా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలని పేర్కొన్నారు. దుర్గామాత లక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదములను అందజేశారు. సాయంత్రం ఏడు గంటలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసరావు, మండల అభివృద్ధి అధికారి సునీత,మండల వైద్యాధికారి ఆశ్రితారెడ్డి,సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్,ఆర్ ఐ హసన్,జిపిఓ హుస్సేన్, నాయకులు కాప రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు బొడ్డుపల్లి ఉదయ్,గడ్డం మహేష్, కిరణ్, ఏనుగుతల లింగన్న,మనోజ్, ప్రవీణ్, శ్యామ్, రవి, శ్రీను, అనిల్, ప్రసాద్, విజయ్, సందీప్, మహేష్, మహేందర్ తదితర భక్త ప్రజలు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం



**చింతలపాలెం(జనంసాక్షి)**
గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు చింతలపాలెం మండలంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రు లందరూ ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని మెట్టు వెంకట రామిరెడ్డి పిలుపునిచ్చా రు .నవంబర్ 6వ తేదీ ఓటరు నమోదు చేసుకోవడానికి చివరి తేదీ అని,అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యావంతులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు,ఇతర పట్టభద్రులకు కూడా ఈ విషయంపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడుగు నరేష్,పంట సుదర్శన్ రెడ్డి,గొల్ల బ్రహ్మారెడ్డి,తొడేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు తక్కువ ధరకు ధాన్యం అమ్మి నష్టపోవద్దు

## వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

**పండుగ అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం : జూలూరు పీఏసీఎస్ చైర్మన్ కళ్యెం రాఘవరెడ్డి**



**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 17 (జనం సాక్షి):** రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని జూలూరు పీఏసీఎస్ చైర్మన్ కళ్యెం రాఘవరెడ్డి విజ్ఞప్తి చేశారు. పిల్లాయిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పండుగ అనంతరం పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ప్రస్తుతం కొందరు వ్యాపారులు క్వింటాల్ ధాన్యాన్ని రూ.2,200కే కొనుగోలు చేస్తున్నారని, రైతులు తొందరపడి తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. ధాన్యాన్ని ఆరబెట్టి నాణ్యతగా సిద్ధం చేసుకుని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని కోరారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైస్ మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి నిరాకరించినా, అవసరమైతే గోదాములకు తరలించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తం గా ఉండాలని, ధాన్యం తడవ కుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిం చారు. ఆరబెట్టిన ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాల్లో నిల్వ చేసు కోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు త్వరగా నిర్వహించి, ధాన్యాన్ని సకాలంలో తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కళ్యెం రాఘవరెడ్డి తెలిపారు.

## దసరా వేడుకలను సోదరభావంతో జరుపుకోవాలి



**మాడుగులపల్లి, అక్టోబర్ 17 (జనంసాక్షి):** దసరా వేడుకలను ప్రశాంతంగా, సోదరభావంతో నిర్వహించు కోవాలని ఎస్సై పి. సురేష్ యాదవ్ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ఉపయోగించాలని తెలిపారు. దసరా సెలవుల్లో పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నీటి ప్రదేశాల వద్ద అప్రమత్తంగా ఉండాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే పోస్టులు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు ఫోన్ చేయాలని, ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్సై స్పష్టం చేశారు.

## అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ ఫలాలు



**మాడుగులపల్లి, అక్టోబర్ 17 (జనంసాక్షి):** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ వేగంగా, పారదర్శకంగా అందించేందుకు స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టినట్లు గ్యార కుంటపాలెం సర్పంచ్ పెద్ది కృపాకర్ తెలిపారు. శనివారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్మార్ట్ కార్డులతో ప్రభుత్వ సేవలు పొందడంలో సమయం, శ్రమ ఆదా అవుతాయని సర్పంచ్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందించి, ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మారెడ్డి, మండల రెవెన్యూ అధికారి రవితేజ, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కార్యాచరణ ప్రణాళికలు



**నూతనకల్, అక్టోబర్ 17 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయం తో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని మండల ప్రత్యేక అధికారి ఎం.ఏ. భారతి సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో 2026?27 ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పంటలకు సకాలంలో సాగునీరు అందించడం, చివరి ఆయకట్టు రైతులకు ప్రాధాన్యత ఇవ్వడం, తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించాలని సూచించారు. అన్ని గ్రామాలకు తాగునీరు, పశువులకు నీరు, పశుగ్రాసం అందించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటూ, శాఖల వారీగా నివేదికలు రూపొందించి జిల్లా అధికారులకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, తహసీల్దార్ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి సైదా నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొని నీటి ప్రతిజ్ఞ చేశారు.



## మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ కు ఘన నివాళులు

**సూర్యాపేట(జనంసాక్షి):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, ఎంసిపిఐ వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ 18వ వర్ధంతి సందర్భంగా శనివారం పార్టీ జిల్లా కార్యదర్శి నజీర్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని మాజీ ఎంపీ భీమిరెడ్డి నరసింహారెడ్డి విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న మాట్లాడుతూ ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం పోరాడారని తెలిపారు. ఆ పోరాటంలో భీమిరెడ్డి నరసింహారెడ్డితో కలిసి పది లక్షల ఎకరాల భూమి పేద ప్రజలకు పంచిన చరిత్ర ఓంకార్ దని అన్నారు. ఐదుసార్లు నర్సంపేట ఎమ్మెల్యేగా ఎన్నికై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో రాష్ట్ర ప్రజల సమస్యల గురించి రెండున్నర గంటలు అనర్గళంగా మాట్లాడి అసెంబ్లీ టైగర్ గా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అనేక పోరాటాలు నిర్వహించి తాను మరణించేంత వరకు సామాజిక న్యాయం, కమ్యూనిస్టుల ఐక్యత కోసం కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లింగంపల్లి పంచాయతీ రాజు, చందుపట్ల పవన్ కళ్యాణ్, నాయకులు గోపగాని లింగయ్య, వైభవ్, శబరి, లక్ష్మణ్, శ్రీను, రాములు తదితరులు పాల్గొన్నారు.



## గుర్రంపోడులో ఘనంగా అన్నదానం

**గుర్రంపోడు, అక్టోబర్ 17 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని రామాలయం ప్రాంగణంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీరామ్ యూత్ భవానీ మాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ కరుణశ్రీ, ఎస్సై వెంకన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అమ్మవారి విగ్రహాన్ని అందించిన మేడి వెంకన్నను కమిటీ సభ్యులు సన్మానించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ నెల 19న ఉదయం 11 గంటలకు ఉత్సవాల ముగింపులో భాగంగా లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోలీస్ ఉద్యోగి కుటుంబానికి కోటి రూపాయల బీమా చెక్

◆**పోలీస్ శాలరీ ప్యాకేజీ ఖాతాతో ఆర్థిక భరోసా..**

◆**ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ నీలేష్ ద్వివేది**

**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 17,(జనంసాక్షి):** ఎస్‌బీఐలో పోలీస్ శాలరీ ప్యాకేజీ ఖాతా కలిగి ఉండి ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగి కుటుంబానికి కోటి రూపాయల బీమా ప్రయోజనం అందజేసినట్లు ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ నీలేష్ ద్వివేది తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నల్లగొండ జిల్లా పోలీస్ ఉద్యోగి షేక్ తయ్యూబ్ కుటుంబానికి బీమా పరిహారం కింద కోటి రూపాయల చెక్‌ను అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. నల్లగొండ జిల్లాకు చెందిన పోలీస్ ఉద్యోగి షేక్ తయ్యూబ్ 2026 ఫిబ్రవరి 13న నల్లగొండలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు విధులు ముగించుకుని మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా చందనపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు ఎస్‌బీఐ నకిరేకల్ శాఖలో పోలీస్ శాలరీ ప్యాకేజీ ఖాతా ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని వైష్ణవి గార్డెన్స్‌లో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దివంగత షేక్ తయ్యూబ్ తండ్రి షేక్ యూసుఫ్ అలీకి కోటి రూపాయల బీమా చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ నీలేష్ ద్వివేది మాట్లాడుతూ.. పోలీస్ శాలరీ ప్యాకేజీ ద్వారా అందించే బీమా ప్రయోజనాలు ప్రమాదవశాత్తు ఉద్యోగిని కోల్పోయిన కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పిస్తాయని తెలిపారు. సమాజ రక్షణ కోసం నిరంతరం సేవలందించే పోలీస్ సిబ్బందికి, వారి కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలవడంలో ఎస్‌బీఐ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ఈ బీమా మొత్తం ఆర్థికంగా తోడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ సతీష్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రియబ్రత మిశ్రా, రీజినల్ మేనేజర్ పద్మ బాబు, ఏజీఎం నితిన్ ఎం., చీఫ్ మేనేజర్ మధు బల్లా తదితరులు పాల్గొన్నారు.

# గుడిపల్లి సర్పంచుల ఫోరం పగ్గాలు సూరబోయిన శ్రీనివాసులుకు!

**- ఏకగ్రీవంగా ఎన్నుకున్న మండల సర్పంచులు..**

**ఐక్యతతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపు**

**గుడిపల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి):** గుడిపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా సూరబోయిన శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని సర్పంచులందరూ ఏకాభిప్రాయంతో ఆయనను ఫోరం అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడికి దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్,ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పలువురు సర్పంచులు అభినందనలు తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారం,గ్రామస్థాయిలో స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశగా సర్పంచుల ఫోరం సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దేవరకొండ శాసన సభ్యులు బాలు నాయక్ శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండల పార్టీ అధ్యక్షులు సతీష్ రెడ్డి,లక్ష్మి నారాయణ యాదవ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూతం సైదులు,సర్పంచులు కసిరెడ్డి శ్రావణి శ్రీనివాస్ రెడ్డి,తోటకూరి వెంకటయ్య,గూడారి మల్లిక వెంకటేశ్వర్లు,వెలుగు సైదులు,రమావత్ అనసూయ తానీషా నాయక్,మైనం రాధిక శ్రీను,రమావత్ శ్రీను, తంగిరాల కృష్ణ కుమార్,మారేపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

